మీరే చదువరి.. క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.. ప్రపంచవ్యాప్త వార్తలు చదవండి...

# నేటి ఈవార్తలు

NETI EVARTHALU దినపత్రిక

మీరే విలేకరి.. క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.. మీ ప్రాంతంలోని వార్తలు పంపండి..

మంగళవారం SUNDAY 27-1-2026 | జగిత్యాల JAGITIAL | పేజీలు: 8 PAGES:8 | వెల రూ.2.00 PRICE: 2.00 | సంపుటి: 1 Volume:1 | సంచిక: 208 Issue: 208

Published from Jagitial
www.evarthalu.com


27 జనవరి 2026 - మంగళవారం శ్రీ విశ్వావసు నామ సంవత్సరం ఉత్తరాయణం - శిశిర ఋతువు మాఘ మాసం - శుక్లపక్షం సూర్యోదయం - ఉ. 6:52 సూర్యాస్తమయం - సా. 6:05 తిథి నవమి రా. 7:03 వరకు తరువాత దశమి సంస్కృత వారం భౌమ వాసరః నక్షత్రం భరణి ఉ. 11:06 వరకు తరువాత కృతిక యోగం శుక్ల తె. 3:040 వరకు కరణం భాలవ ఉ. 8:13 వరకు కౌలవ రా. 7:03 వరకు వర్జ్యం రా. 10:17 నుండి రా. 11:46 వరకు దుర్ముహూర్తం ఉ. 9:07 నుండి ఉ. 9:52 వరకు రా. 11:11 నుండి రా. 12:03 వరకు రాహుకాలం మ. 3:16 నుండి సా. 4:40 వరకు యమగండం ఉ. 9:40 నుండి ఉ. 11:04 వరకు గుళికాకాలం మ. 12:28 నుండి మ. 1:52 వరకు బ్రహ్మముహూర్తం తె. 5:16 నుండి ఉ. 6:04 వరకు అమృత ఘడియలు ఉ. 6:37 నుండి ఉ. 8:08 వరకు అభిజిత్ ముహూర్తం మ. 12:06 నుండి మ. 12:51 వరకు గమనిక: "ం" అనగా మరుసటి రోజున




## నేడు బ్యాంకులు బంద్

### 5 రోజుల పనిదినాల కోసం విధుల బహిష్కరణ

న్యూఢిల్లీ: బ్యాంకింగ్ ఖాతాదారులకు బిగ్ అలర్ట్. జనవరి 27న దేశవ్యాప్తంగా బ్యాంకులన్నీ మూతపడనున్నాయి. బ్యాంకు సంఘాలు మంగళవారం బంద్ చేపడుతున్నాయి. దేశవ్యాప్తంగా ఈ బంద్ జరగనుంది. వారానికి ఐదు రోజుల పని దినాలను అమలు చేయాలంటూ బ్యాంకు ఉద్యోగులు రేపు విధులు బహిష్కరించి నిరసన చేపట్టనున్నాయి. బ్యాంకులు మూతపడనుండటంతో చెక్కుల క్లియరెన్స్ వంటి సేవలు నిలిచిపోతున్నాయి. ఇక యూపీఐ, నెట్, మొబైల్ బ్యాంకింగ్ వంటి సేవలు యథావిధిగా పనిచేస్తాయి. బ్యాంక్ సేవల్లో అంతరాయం కలిగే తరువాయి 2 వ పేజీలో...



## బ్రేకప్ అయితే రేప్ కేసులా?

### సహజీవనాలపై అలహాబాద్ హైకోర్టు ఘాటు వ్యాఖ్యలు

### ఇలాంటివి రేప్ కేసులు కాబోవని స్పష్టీకరణ

ప్రయాగ్‌రాజ్, జనవరి 26 (ఈవార్తలు): అలహాబాద్ హైకోర్టు లివ్-ఇన్ రిలేషన్‌షిప్‌లపై చేసిన కీలక వ్యాఖ్యలు ఇప్పుడు దేశవ్యాప్తంగా చర్చనీయాంశమయ్యాయి. భారతీయ యువతలో పెరుగుతున్న ఈ ధోరణి.. దానివల్ల తలెత్తుతున్న న్యాయపరమైన చిక్కులపై కోర్టు ఘాటు వ్యాఖ్యలు చేసింది. యువతలో లివ్-ఇన్ రిలేషన్‌షిప్‌ల పట్ల ఆసక్తి పెరగడానికి పాశ్చాత్య ఆలోచనలే ప్రధాన కారణమని జస్టిస్ సిద్ధార్థ్, జస్టిస్ ప్రశాంత్ మిశ్రాలతో కూడిన ధర్మాసనం పేర్కొంది. ఈ తరహా రిలేషన్‌షిప్ బ్రేక్ అయినప్పుడు.. మహిళలు తమ భాగస్వాములపై అత్యాచార ఆరోపణలతో ఎఫ్ఐఆర్ నమోదు చేయడం తరువాయి 2 వ పేజీలో...



## రేవంత్ ఆబ్సెంట్

### గణతంత్ర వేడుకలకు గైర్హాజరు

### హార్వర్డ్‌లో స్పెషల్ క్లాసుల్లో సీఎం

దేశ 77వ గణతంత్ర దినోత్సవ వేడుకలకు సీఎం రేవంత్ రెడ్డి గైర్హాజరయ్యారు. అమెరికాలోని హార్వర్డ్ యూనివర్సిటీలో లీడర్ షిప్ కోర్సు క్లాసులకు హాజరు అవుతున్న ఆయన.. తొలిరోజు 21వ శతాబ్ధంలో నాయకత్వంపై కోర్సులో భాగంగా అధికారిక విశ్లేషణ- నాయకత్వం అంశంపై తొలి సెషన్‌ను విన్నారు.

హైదరాబాద్, జనవరి 26 (ఈవార్తలు): క్లాసుల్లో భాగంగా అధికారిక విశ్లేషణ- నాయకత్వం అంశంపై కేస్ అనాలిసిస్, వివిధ అంశాలపై తరగతులు, కన్సల్టేటివ్ గ్రూప్ వర్క్ వంటి కార్యక్రమాల్లో సభ్యులు పాల్గొన్నారు. హార్వార్డ్ యూనివర్సిటీకి -2వ పేజీలో...



## ఆ నలుగురు!

### భట్టితో ఉత్తమ్, దుద్దిళ్ల, అడ్లూరి భేటీ

### ఒకే కారులో ప్రజాభవన్‌కు చేరిక.. బొగ్గు టెండర్ల స్కాం వేళ కీలక సమావేశం

### అంతర్గత విషయాలు లీక్‌పై చర్చా.. భేటీలో 'రహస్య' ఎజెండా తీర్మానం!

రాష్ట్రంలో సింగరేణి బొగ్గు టెండర్ల ప్రకంపనలు చోటుచేసుకుంటున్న వేళ నలుగురు మంత్రులు సమావేశం కావడం అటు ప్రభుత్వవర్గాల్లో, ఇటు పార్టీలో చర్చకు దారితీసింది. నైనీ కోల్ బ్లాక్ మైనింగ్ టెండర్ల విషయంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఆరోపణలు ఎదుర్కొంటున్న సమయంలో మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, శ్రీధర్‌బాబు, అడ్లూరి లక్ష్మణ్ ప్రజా భవన్‌లో సమావేశమయ్యారు.

హైదరాబాద్, జనవరి 26 (ఈవార్తలు): ఒకవైపు బీఆర్ఎస్ నేతలు సింగరేణి వ్యవహారంలో దర్యాప్తు జరిపించాలని కోరుతూ గవర్నర్‌ను మంగళవారం కలవనున్న నేపథ్యంలో మంత్రుల భేటీకి ప్రాధాన్యం ఏర్పడింది. ఈ సమావేశంలో మంత్రుల మధ్య ఏయే అంశాలు చర్చకు వచ్చాయన్నది తెలియకపోయినా, కీలకమైన అంశాలనే డిస్కస్ చేసినట్లు ఊహాగానాలు వెలువడుతున్నాయి. భవిష్యత్తు కార్యాచరణపైన చర్చించారా లేక అంతర్గత విషయాలు లీక్ కావడంపై చర్చించారా అన్నది తెలియరాలేదు.

**రామగుండంలో ఐదుగురు మంత్రుల సమావేశం!**

పది రోజుల క్రితం రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో పలు అభివృద్ధి కార్యక్రమాల్లో ఐదుగురు మంత్రులు పాల్గొన్నారు. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కతో పాటు మంత్రులు శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్, కొండా సురేఖ, అడ్లూరి లక్ష్మణ్ పాల్గొన్నారు. ఇప్పుడు నలుగురు మంత్రులు సమావేశమయ్యారు. ఈ సమావేశానికి కొనసాగింపుగా నలుగురూ ఒకే కారులో లోక్‌భవన్‌లో జరిగిన ఎట్ హోమ్ కార్యక్రమం నుంచి తిరుగు ప్రయాణం కావడం విశేషం. ఈ నలుగురు మంత్రులూ మొదటి నుంచీ కాంగ్రెస్ పార్టీతో కొనసాగుతున్నవారే. సీఎం రేవంత్‌రెడ్డి అమెరికా టూర్‌లో ఉండగా ఈ భేటీ జరగడం సరికొత్త సందేహాలకు తావిస్తోంది. ఒకవైపు ప్రతిపక్షాల ఆరోపణలు, మరోవైపు కేంద్ర బొగ్గు శాఖ మంత్రి కిషన్‌రెడ్డి కామెంట్స్, ఇంకోవైపు కోల్ ఇండియా అధికారుల విచారణ.. వీటన్నింటి నేపథ్యంలో సింగరేణి అంశానికి తరువాయి 2 వ పేజీలో...

## కాంగ్రెస్‌పై వ్యతిరేకత

### ప్రజల్లో భారీస్థాయిలో అసంతృప్తి

### ప్రొఫెసర్ కోదండరాం సంచలన వ్యాఖ్యలు

### పార్టీ అధిష్ఠానం దృష్టికి తీసుకెళ్తానని వెల్లడి



తెలంగాణ జన సమితి అధ్యక్షుడు ప్రొఫెసర్ కోదండరాం కాంగ్రెస్ ప్రభుత్వంపై సంచలన వ్యాఖ్యలు చేశారు. రాష్ట్ర ప్రభుత్వంపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత, అసంతృప్తి నెలకొన్నాయని అన్నారు. ఈ విషయాన్ని కాంగ్రెస్ పార్టీ అధిష్ఠానం దృష్టికి తీసుకువెళతానని తెలిపారు. మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీతో పొత్తుపై ఇంకా నిర్ణయం తీసుకోలేదని ఆయన స్పష్టం చేశారు.

హైదరాబాద్, జనవరి 26 (ఈవార్తలు): అధికార పార్టీకి తమ నిర్ణయాన్ని తెలియజేశామని పేర్కొన్నారు. మున్సిపల్ ఎన్నికల అంశానికి సంబంధించి కాంగ్రెస్ పార్టీని సంప్రదించామని, ఆ పార్టీ నిర్ణయం కోసం వేచి చూస్తున్నామని ఆయన అన్నారు. తాము మాత్రం పోటీ చేయాలని నిర్ణయించుకున్నామని స్పష్టం చేశారు. సింగరేణిని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్క తెలంగాణ బిడ్డపై ఉందని కోదండరాం అన్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ సింగరేణిని తరువాయి 2 వ పేజీలో...

## బంగారం-వెండి ధరలు

| | |
|---|---|
| బంగారం (గ్రాము-24 క్యారెట్స్): | రూ.16,195 |
| వెండి (గ్రాము): | రూ.375 |
| ప్లాటినం (గ్రాము): | రూ.8,500 |

## 72 గజాల జాగా ఇస్తాం

### అందులోనే ఇందిరమ్మ ఇల్లు కట్టిస్తాం

### పట్టణ వాసులకు పొంగులేటి శుభవార్త



తెలంగాణలోని పట్టణాల్లో నివాస స్థలం లేని పేద ప్రజలకు అండగా నిలవాలని ప్రభుత్వం భావిస్తున్నట్లు తెలుస్తోంది. ఈ మేరకు పట్టణ ప్రాంతాల్లో సొంత భూమి లేని అర్హులైన నిరుపేదలకు.. 72 గజాల చొప్పున ఇంటి స్థలం కేటాయించే ప్రతిష్టాత్మక కార్యక్రమాన్ని త్వరలోనే ప్రారంభిస్తామని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. ఇందుకోసం అధికారులు ప్రభుత్వ స్థలాలను గుర్తించి కార్యాచరణ ప్రారంభించే విధంగా కసరత్తు చేస్తున్నట్లు చెప్పారు.

మహబూబాబాద్, జనవరి 26 (ఈవార్తలు): మహబూబాబాద్ జిల్లా మరిపెడ మండల కేంద్రంలో.. జిల్లా వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో ప్రభుత్వం నుంచి అర్హులైన వారికి మంజూరైన రైతు సబ్సిడీ యంత్రాలను సోమవారం అందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పట్టణ పేదలకు ఇళ్ల స్థలం విషయం గురించి వెల్లడించారు. అయితే దీని గురించి పూర్తి వివరాలు వెల్లడించలేదు. కేటాయించిన స్థలాల్లో ఇందిరమ్మ ఇళ్లు నిర్మిస్తారా లేదా అనే దానిపై స్పష్టత లేదు. ఈ సందర్భంగా తమ ప్రజా ప్రభుత్వం ప్రజలకు అన్ని విధాలా మేలు చేస్తోందని అన్నారు. అందుకే కాంగ్రెస్ ప్రభుత్వాన్ని వచ్చే ఎన్నికల్లో కూడా మళ్లీ గెలిపించాలని తరువాయి 2 వ పేజీలో...

## రైజింగ్.. మా నినాదం

### ప్రజా ప్రభుత్వంలో గణనీయ విజయాలు.. గణతంత్ర వేడుకల్లో గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ



ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో రెండేళ్ల క్రితం ఏర్పడిన ప్రజా ప్రభుత్వం రాష్ట్రంలో గణనీయమైన విజయాలను సాధించి.. ప్రజల విశ్వాసాన్ని, ప్రశంసలను సంపాదించిందని తెలంగాణ గవర్నర్ విష్ణుదేవ్ శర్మ అన్నారు. సికింద్రాబాద్‌లోని పరేడ్ గ్రౌండ్‌లో నిర్వహించిన గణతంత్ర వేడుకల్లో గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ పాల్గొని మాట్లాడారు. '77వ భారత గణతంత్ర దినోత్సవం సందర్భంగా తెలంగాణ ప్రజలందరికీ నా హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేస్తున్నాను.

సికింద్రాబాద్, జనవరి 26 (ఈవార్తలు): తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ద్వారా గ్రూప్-1, 2, 3, 4 నియామకాలను ప్రభుత్వం విజయవంతంగా పూర్తి చేసింది. ఇప్పటివరకు పబ్లిక్ సర్వీస్ కమిషన్, పోలీస్ రిక్రూట్‌మెంట్ బోర్డు తదితర సంస్థల ద్వారా 62,749 మంది యువతకు ఉద్యోగాలు కల్పించింది. మహిళల ఆర్థికాభివృద్ధి, సంక్షేమానికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యమిస్తోంది. న్యాయం, స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వం అనే మూల సూత్రాలతో దేశం నడుస్తోంది. 'తెలంగాణ రైజింగ్ విజన్-2047' అనే దార్శనిక పత్రాన్ని తెలంగాణ సర్కారు ఆవిష్కరించింది. దీని ద్వారా ప్రభుత్వం సమగ్ర, సమానమైన, సుస్థిర అభివృద్ధికి రోడ్‌మ్యాప్‌ను ప్రకటించింది. 'వికసిత్ భారత్' ఉద్దేశంతో కేంద్ర ప్రభుత్వం 2047 నాటికి 30 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థను సాధించాలని లక్ష్యంగా పెట్టుకుంది. అదే తరువాయి 2 వ పేజీలో...

## విశ్వవాణి



అమెరికాలోని కాలిఫోర్నియా ప్రభుత్వం అక్కడి అన్ని కెనాల్స్‌పై సోలార్ ప్యానెళ్లను ఏర్పాటు చేసింది. నీటి ఆవిరిని అరికట్టి కరువును దూరం చేయాలన్న ఉద్దేశం ఒకటైతే, సోలార్ ప్యానెళ్ల ద్వారా పర్యావరణ హిత విద్యుత్తును ఉత్పత్తి చేయాలన్న సంకల్పం మరోటి. ఇందుకోసం అక్కడి ప్రభుత్వం 20 మిలియన్ డాలర్లను వెచ్చించింది. ఇప్పుడు వాటి ద్వారా ఇప్పటి వరకు 1.6 మెగావాట్ల విద్యుత్తును ఉత్పత్తి చేసింది.



## అమెరికాలో మంచు తుఫాను

### విమానం కూలి ఏడుగురి మృతి

## నేడు కేంద్ర అఖిలపక్ష భేటీ

### పార్లమెంట్ బడ్జెట్ సమావేశాలపై చర్చ

న్యూఢిల్లీ: పార్లమెంట్ సమావేశాలు ప్రారంభం కానున్న తరుణంలో మంగళవారం ఉదయం 11 గంటలకు కేంద్ర ప్రభుత్వం అఖిలపక్ష సమావేశం నిర్వహించనుంది. ఉభయ సభల్లో సమావేశాలు సజావుగా జరిగేందుకు సహకరించాలని అఖిలపక్షాన్ని కేంద్ర ప్రభుత్వం కోరనుంది. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ప్రసంగంతో పార్లమెంట్ బడ్జెట్ సమావేశాలు ప్రారంభం కానున్నాయి. జనవరి 29వ తేదీన ఆర్థికసర్వే ప్రవేశపెట్టనుంది కేంద్ర ప్రభుత్వం. ఫిబ్రవరి 1వ తేదీన బడ్జెట్‌ను ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ పార్లమెంట్‌లో ప్రవేశపెట్టనున్నారు. ఆ రోజు ఆదివారం వచ్చింది. అయితే ఇలా ఆదివారం రోజు తరువాయి 2 వ పేజీలో...



## సంతోష్ రావుకు సిట్ నోటీసులు

### ఫోన్ ట్యాపింగ్ కేసులో నేడు విచారణ

### హాజరు అవుతానని మజీ ఎంపీ వెల్లడి

హైదరాబాద్, జనవరి 26 (ఈవార్తలు): తెలంగాణలో సంచలనం సృష్టించిన ఫోన్ ట్యాపింగ్ కేసు విచారణను సిట్ వేగవంతం చేసింది. ఈ కేసు దర్యాప్తులో భాగంగా బీఆర్ఎస్ నేత, మాజీ ఎంపీ జోగినపల్లి సంతోష్ రావుకు ప్రత్యేక -2 వ పేజీలో...

# రాశి ఫలాలు



26.1.2026

మేషం: సమాజంలో సేవ కార్యక్రమాలు నిర్వహించి గౌరవ మర్యాదలు పెంచుకుంటారు. భూ క్రయ విక్రయాలలో నూతన లాభాలు అందుతాయి. ఉద్యోగాలలో ఆశించిన పదవులు పొందుతారు. నూతన వాహనం కొనుగోలు చేస్తారు. వృత్తి, వ్యాపారాలలో కీలక నిర్ణయాలు తీసుకుని లాభాలు సాధిస్తారు.

వృషభం: కుటుంబ సభ్యుల నుండి ఒత్తిడి పెరుగుతుంది. ఆర్థిక సమస్యలు వలన మానసిక ప్రశాంతత లోపిస్తుంది. దీర్ఘకాలిక వివాదాలు కొంత చికాకు పరుస్తాయి. దూర ప్రయాణాలు చేస్తారు. వ్యాపారాలు అంతంత మాత్రంగా సాగుతాయి. ఉద్యోగాలలో అధికారుల నుండి విమర్శలు ఎదుర్కొంటారు.

మిధునం: ఋణ పరమైన ఒత్తిడిలు మానసిక సమస్యలు కలిగిస్తాయి. ఆలోచనలలో స్థిరత్వం లోపిస్తుంది. చేపట్టిన పనులు చాలాకష్టం మీద పూర్తి అవుతాయి. కుటుంబ సభ్యులతో మాటపట్టింపులు కలుగుతాయి. వ్యాపారాలలో నష్ట సూచనలున్నవి. ఉద్యోగాలలో అధికారుల కోపానికి గురి అవుతారు.

కర్కాటకం: సంఘంలో ప్రముఖుల ఆదరణ పెరుగుతుంది. విలువైన వాహనాలు కొనుగోలు చేస్తారు. చేపట్టిన పనులలో కార్యసిద్ధి కలుగుతుంది. సంతాన విద్యా విషయాలు సంతృప్తి కలిగిస్తాయి. వ్యాపారాలు పురోగతిలో సాధిస్తారు. ఉద్యోగమున సహోద్యోగులతో సఖ్యతగా వ్యవహరిస్తారు.

సింహం: చిన్ననాటి మిత్రులతో దూర ప్రయాణాలు చేస్తారు. నూతన వ్యక్తుల పరిచయం లాభిస్తుంది. చేపట్టిన వ్యవహారములలో అనుకూలత కలుగుతుంది. నిరుద్యోగుల ప్రయత్నాలు కలసివస్తాయి. వృత్తి వ్యాపారాలలో యత్న కార్యసిద్ధి కలుగుతుంది. ఉద్యోగులకు హోదాలు పెరుగుతాయి.

కన్య: ఆర్థిక పరిస్థితి ఆశాజనకంగా ఉంటుంది. వ్యవహారాలలో శ్రమాధిక్యత కలుగుతుంది. బంధు మిత్రులతో స్వల్ప విభేదాలు కలుగుతాయి. గృహ నిర్మాణ ప్రయత్నాలు మందగిస్తాయి. వృత్తి, వ్యాపారాలు సాధారణంగా ఉంటాయి. ఆర్థిక విషయాలలో ఆలోచించి నిర్ణయాలు తీసుకోవాలి.

తుల: ప్రయాణాలలో మార్గ అవరోధాలు కలుగుతాయి. ఋణదాతల ఒత్తిడి పెరుగుతుంది. కుటుంబ సభ్యుల ప్రవర్తన వలన మానసిక ప్రశాంతత లోపిస్తుంది. దైవ సేవా కార్యక్రమాలలో పాల్గొంటారు. వృత్తి, వ్యాపారాలు నిదానంగా సాగుతాయి. ఉద్యోగ వాతావరణం నిరుత్సాహ పరుస్తుంది.

వృశ్చికం: సోదరుల నుండి శుభవార్తలు అందుతాయి. నూతన వాహనం కొనుగోలు చేస్తారు. దీర్ఘకాలిక వివాదాలు పరిష్కరించుకుంటారు. సన్నిహితులతో పుణ్యక్షేత్రాలు సందర్శిస్తారు. వ్యాపారాలు అనుకూలంగా సాగుతాయి. నిరుద్యోగులకు అందిన సమాచారం ఉత్సాహాన్నిస్తుంది.

ధనస్సు: ఆధ్యాత్మిక విషయాలపై ఆసక్తి కలుగుతుంది. చేపట్టిన పనుల్లో ప్రతిబంధకాలు ఉంటాయి. కుటుంబ వాతావరణం కొంత చికాకు కలిగిస్తుంది. నేత్ర సంభందిత ఆరోగ్య సమస్యలు కలుగుతాయి. నూతన వ్యాపార విస్తరణ ప్రయత్నాలు కలిసిరావు. ఉద్యోగమున అదనపు బాధ్యతలు ఉంటాయి.

మకరం: సన్నిహితులతో గృహమున ఉత్సాహంగా గడుపుతారు. చేపట్టిన వ్యవహారాలలో ఆకస్మిక విజయం కలుగుతుంది. ఖర్చుకు మించిన ఆదాయం సంతృప్తి కలిగిస్తుంది. వ్యాపారాలలో నూతన ఆలోచనలు ఆచరణలో పెడతారు. ఉద్యోగమున ఆశించిన అవకాశములు అందుతాయి.

కుంభం: ప్రయాణాలు వాయిదాపడతాయి. జీవిత భాగస్వామితో అకారణ వివాదాలు కలుగుతాయి. పాత ఋణాలు తీర్చడానికి నూతన రుణ ప్రయత్నాలు చేస్తారు. దైవ కార్యక్రమాలలో పాల్గొంటారు. వృత్తివ్యాపారాలలో ఊహించని మార్పులు తప్పవు. ఉద్యోగమున ప్రతికూల వాతావరణం ఉంటుంది.

మీనం: ఆర్థిక పరిస్థితి కొంత మెరుగు పడుతుంది. గృహోపకరణాలు కొనుగోలు చేస్తారు. గృహమున శుభకార్యాలు నిర్వహిస్తారు. నిరుద్యోగులకు అనుకూలత కలుగుతుంది. వృత్తి, వ్యాపారాలలో నూతనోత్సాహంతో ముందుకు సాగుతారు. ఉద్యోగస్తులకు అధికారుల అండదండలు పొందుతారు.

# సంతోష్ రావుకు సిట్ నోటీసులు

మొదటి పేజీ తరువాయి

దర్యాప్తు బృందం నోటీసులు జారీ చేసింది. మంగళవారం ఉదయం 11 గంటలకు జూబ్లీహిల్స్ పోలీస్ స్టేషన్‌లో విచారణకు హాజరు కావాలని సిట్ నోటీసుల్లో పేర్కొంది. గత ప్రభుత్వ హయాంలో ఫోన్ ట్యాపింగ్ జరిగిందని ఆరోపణలున్నాయి. గత రెండేళ్లుగా కేసు విచారణ కొనసాగుతోంది. తాజాగా మాజీ ఎంపీ సంతోష్ రావును ప్రశ్నించేందుకు సిట్ సిద్ధంగా ఉంది. ఇప్పటికే ఈ కేసులో బీఆర్ఎస్ నేతలు, తెలంగాణ మాజీ మంత్రులు హరీష్ రావు, కేటీఆర్‌లకు సిట్ నోటీసులు ఇవ్వడం, వారు అధికారుల ముందు విచారణకు హాజరైన సంగతి తెలిసిందే. హరీష్ రావును సుమారు 7 గంటలకు పైగా విచారించిన అధికారులు, ఆ తర్వాత కేటీఆర్ విచారణకు హాజరుకాగా స్టేట్‌మెంట్ తీసుకున్నారు. మాజీ ఇంటెలిజెన్స్ అధికారుల వాంగ్మూలం, సాక్ష్యాధారాల ఆధారంగా ఈ కేసులో జోగినపల్లి సంతోష్ రావు పాత్రపై సిట్ దృష్టి సారించింది. ఈ క్రమంలో మాజీ ఎంపీకి 160 సీఆర్‌పీసీ కింద నోటీసులు జారీ చేసింది. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో జరిగినట్లుగా నమోదైన ఫోన్ ట్యాపింగ్ కేసు దర్యాప్తు ప్రస్తుతం క్లైమాక్స్ దశకు చేరుకుంది. హైదరాబాద్ పోలీస్ కమిషనర్ వీసీ సజ్జనార్ నేతృత్వంలోని ప్రత్యేక విచారణ బృందం ఈ కేసులో కీలక



ఆధారాలను సేకరించడమే కాకుండా, బీఆర్ఎస్ అగ్రనేతలను విచారిస్తోంది. గులాబీ పార్టీ నేతలకు వరుస నోటీసులు రాష్ట్ర రాజకీయాల్లో పెను దుమారం రేపుతున్నాయి. నేతలపై ప్రధాన ఆరోపణలు రాజకీయ ప్రత్యర్థులు, వ్యాపారవేత్తలు, జర్నలిస్టులు, సినీ ప్రముఖులు, న్యాయమూర్తుల ఫోన్లను చట్టవిరుద్ధంగా ట్యాపింగ్ చేశారనేది ప్రధాన ఆరోపణ బీఆర్ఎస్ నేతలపై ఉంది. ఫోన్ ట్యాపింగ్ ద్వారా సమాచారాన్ని సేకరించి, వ్యాపారవేత్తలను బెదిరించి పార్టీకి ఎలక్టోరల్ బాండ్ల రూపంలో విరాళాలు సేకరించారనే ఫిర్యాదులు సిట్‌కు అందాయి. సిరిసిల్ల కేంద్రంగా ఒక ప్రత్యేక 'వార్ రూమ్' ఏర్పాటు చేసి నిఘా నిర్వహించారని, దీని కోసం ఇజ్రాయెల్ నుంచి అత్యాధునిక సాఫ్ట్‌వేర్ కొనుగోలుకు పార్టీ నిధులను మళ్లించారని సిట్ అనుమానాలు వ్యక్తం చేసింది. అసెంబ్లీ ఎన్నికల తరువాత ప్రభుత్వ మార్పు సమయంలో కీలకమైన డేటా, హార్డ్ డిస్క్‌లను ధ్వంసం చేశారనే ఆరోపణలపై మాజీ ఎస్ఐబీ అధికారులను ఇప్పటికే అరెస్ట్ చేశారు. పలువురు పోలీసు అధికారులు బెయిల్ రావడంతో విడుదలయ్యారు. కాగా, మాజీ మంత్రి హరీష్ రావును ఇటీవల సిట్ అధికారులు సుమారు 7 గంటల పాటు విచారించారు. ఆయనను ఈ కేసులో ఒకవైపు నిందితుడిగా, మరోవైపు బాధితుడిగా (ఆయన ఫోన్ కూడా ట్యాప్ అయినట్లు ఆధారాలు) అధికారులు భావిస్తున్నారు. మంత్రి జూపల్లి కృష్ణారావు మాత్రం ఈ కేసులో సిట్ అధికారులు కేటీఆర్, హరీష్ రావులను సాక్ష్యులుగా మాత్రమే విచారించారని, అయితే ఎందుకు భయపడుతున్నారని ఇటీవల కీలక వ్యాఖ్యలు చేశారు. ఈ నేపథ్యంలో సంతోష్ రావుకు 160 సీఆర్పీసీ కింద నోటీసులు ఇచ్చి విచారణకు పిలవడం గమనార్హం.

# బ్రేకప్ అయితే రేప్ కేసులా?

మొదటి పేజీ తరువాయి

ప్రస్తుతం ట్రెండ్ గా మారుతోందని కోర్టు అభిప్రాయపడింది. ప్రస్తుత చట్టాలు మహిళలకు అనుకూలంగా ఉన్నాయని.. అయితే ఇవి లివ్-ఇన్ రిలేషన్‌షిప్ అనే భావన అసలు ఉనికిలో లేని కాలంలో రూపొందించబడ్డాయని కోర్టు గుర్తు చేసింది. సామాజిక మార్పులను పరిగణనలోకి తీసుకోకుండా.. పాత రూల్స్, చట్టాల ఆధారంగా పురుషులను దోషులుగా నిర్ధారించడం సరికాదని ధర్మాసనం వ్యాఖ్యానించింది. పరస్పర అంగీకారంతో కూడిన సంబంధాలు దెబ్బతిన్నప్పుడు, వాటిని అత్యాచారంగా చిత్రీకరించడం పెరిగిపోతోందని ధర్మాసనం ఆందోళన వ్యక్తం చేసింది. చంద్రేష్ అనే వ్యక్తి ఒక యువతిని కిడ్నాప్ చేసి, పెళ్లి పేరుతో మోసం చేసి అత్యాచారానికి పాల్పడ్డాడనే ఆరోపణలతో ట్రయల్ కోర్టు అతనికి జీవిత ఖైదు విధించింది. నిందితుడు ఆ యువతిని బెంగళూరుకు తీసుకెళ్లి ఆరు నెలల పాటు కలిసి ఉన్నాడని ప్రాసిక్యూషన్ వాదించింది. దీనిపై నిందితుడు హైకోర్టును ఆశ్రయించగా.. అసలు వాస్తవాలు వెలుగులోకి వచ్చాయి. బాధితురాలు మైనర్ అని ట్రయల్ కోర్టు భావించింది. కానీ అసిఫికేషన్ టెస్ట్ ప్రకారం ఆమె వయస్సు సుమారు 20 ఏళ్లు అని.. అంటే ఘటన సమయంలో ఆమె మేజర్ అని హైకోర్టు స్పష్టం చేసింది. ఈ కేసులో యువతి నిందితుడితో కలిసి బస్సుల్లో, రైళ్లలో కలిసి తిరిగినప్పుడు ఎక్కడా అభ్యంతరం చెప్పలేదని కోర్టు గుర్తించింది. బెంగళూరు వంటి రద్దీ ప్రాంతంలో ఆరు నెలల పాటు కలిసి ఉన్నారని.. అది పూర్తిగా ఆమె ఇష్టపూర్వకంగా జరిగిన ప్రయాణమని అలహాబాద్ హైకోర్టు పేర్కొంది. ఎఫ్ఐఆర్‌లో ఒక వయస్సు, కోర్టులో మరో వయస్సు చెప్పడం కేవలం న్యాయ సలహా మేరకే జరిగిందని కోర్టు తప్పుబట్టింది. దీంతో బాధితురాలు మేజర్ అని.. ఆమె తన ఇష్టపూర్వకంగానే నిందితుడితో వెళ్లినందున కిడ్నాప్, అత్యాచారం అనే ఆరోపణలు చెల్లవని హైకోర్టు తేల్చి చెప్పింది. లివ్-ఇన్ రిలేషన్‌షిప్ ఫెయిల్ అయిన ప్రతిసారీ దాన్ని అత్యాచారంగా పరిగణించలేమని స్పష్టం చేస్తూ.. చంద్రేష్‌కు విధించిన శిక్షను రద్దు చేసి అతడిని విడుదల చేయాలని కోర్ట్ తీర్పు వెలువరిస్తూ ఆదేశాలు జారీ చేసింది.



# 72 గజాల జాగా ఇస్తాం

మొదటి పేజీ తరువాయి

కోరారు. గత ప్రభుత్వం కేవలం రైతు బంధు ఇచ్చి సరిపెట్టిందని, కాంగ్రెస్ రైతు భరోసా, బోనస్ అందిస్తున్నామన్నారు. అంతేకాకుండా వ్యవసాయ పనిముట్లు కూడా సబ్సిడీపై అందిస్తున్నామని తెలిపారు. మహబూబాబాద్ జిల్లా వ్యాప్తంగా రైతులకు రూ. 3.16కోట్ల విలువ చేసే పనిముట్లు అందించినట్లు పేర్కొన్నారు. రాబోయే రోజుల్లో రాష్ట్రవ్యాప్తంగా క్రమం తప్పకుండా అందిస్తామని మంత్రి హామీ ఇచ్చారు. మరోవైపు, ఇందిరమ్మ ఇళ్లలో కూడా ప్రభుత్వం జోరు పెంచింది. తెలంగాణ వ్యాప్తంగా ఇప్పటి వరకు 3.49 లక్షల ఇళ్లకు మంజూరు అయ్యాయి. అందులో మరో మూడు నెలల్లో లక్ష ఇళ్ల ప్రారంభానికి సిద్ధమవుతున్నాయి. మిగిలిన 2.49 లక్షల ఇళ్ల నిర్మాణాన్ని జూన్ లేదా జూలై నాటికి పూర్తి చేసేలా కసరత్తు చేస్తున్నారు. కాగా, ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. అయితే ఇంకా పునాది దశలో నిలిచిపోయిన లేదా ఇంకా ప్రారంభించని ఇళ్ల వివరాలను సేకరించి.. స్థానిక ఎమ్మెల్యేలకు ఆ లిస్ట్‌ను అందజేయనున్నారు.



# అమెరికాలో మంచు తుఫాను

## విమానం కూలి ఏడుగురి మృతి

వాషింగ్టన్: అమెరికాలో మంచు తుఫాను బీభత్సం సృష్టిస్తున్న వేళ.. ఓ ప్రైవేటు విమానం కూలిపోయింది. ఈ ప్రమాదంలో ఏడుగురు మృతి చెందగా.. ఒకరికి తీవ్ర గాయాలయ్యాయి. మైన్‌లోని బాంగోర్ అంతర్జాతీయ విమానాశ్రయంలో ఈ దుర్ఘటన చోటుచేసుకుంది. అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. ఎనిమిది మందితో కూడిన ఓ ప్రైవేటు బిజినెస్ విమానం స్థానిక కాలమానం ప్రకారం ఆదివారం రాత్రి 7.45 గంటల సమయంలో బాంగోర్ ఎయిర్‌పోర్ట్ నుంచి టేకాఫ్ అయింది. క్షణాల వ్యవధిలోనే కూలి విమానంలో మంటలు చెలరేగాయి. ప్రమాద సమయంలో దట్టంగా మంచు కురుస్తున్నట్లు తెలుస్తోంది. ఈ ఘటన నేపథ్యంలో అధికారులు విమానాశ్రయాన్ని మూసివేశారు. మృతుల వివరాలు తెలియరాలేదు. ఈ ఘటనపై ఫెడరల్ ఏవియేషన్ అడ్మినిస్ట్రేషన్, నేషనల్ ట్రాన్స్‌పోర్టేషన్ సేఫ్టీ బోర్డ్ దర్యాప్తు చేపట్టాయి. మంచు తుఫాను కారణంగా అమెరికాలో ఆదివారం దాదాపు 12 వేల విమానాలు రద్దయ్యాయి. ఫ్లైట్ ట్రాకర్ వెబ్‌సైట్ 'ఫ్లైట్‌అవేర్.కామ్' వివరాల ప్రకారం దాదాపు 20 వేల విమానాలు ఆలస్యమయ్యాయి. వాషింగ్టన్, బాల్టిమోర్, నార్త్ కరోలినా, న్యూయార్క్, న్యూజెర్సీ, ఫిలడెల్ఫియాలోని ఎయిర్‌పోర్ట్‌లలో సేవలకు అంతరాయం కలిగింది.

# నేడు బ్యాంకులు బంద్

మొదటి పేజీ తరువాయి

అవకాశముందని బ్యాంకులు ఇప్పటికే తమ కస్టమర్లకు మెస్సేజ్‌లు పంపుతున్నాయి. యునైటెడ్ ఫోరమ్ ఆఫ్ బ్యాంక్ యూనియన్స్ ఆధ్వర్యంలో బ్యాంక్ ఉద్యోగులు ఈ సమ్మె చేపడుతున్నారు. ప్రభుత్వ రంగ బ్యాంక్ ఉద్యోగులతో పాటు ప్రైవేట్ బ్యాంక్ ఉద్యోగులు కూడా ఈ బంద్‌లో పాల్గొంటున్నారు. దీంతో ప్రభుత్వ, ప్రైవేట్ బ్యాంకులన్నీ క్లోజ్ కానున్నాయి. ఇప్పటికే ఉద్యోగ సంఘాలు సమ్మె నోటీసులు అందించాయి. మార్చి 2024లో ఐదు రోజుల వర్కింగ్ డేస్‌పై ఇండియన్ బ్యాంకింగ్ అసోషియేషన్, బ్యాంక్ సంఘాల మధ్య ఒప్పందం కుదిరింది. దీనికి ప్రాధమికంగా ఆమోదం లభించినప్పటికీ.. ఇంకా తుది నిర్ణయం ఆర్బీఐ, కేంద్ర ఆర్థికశాఖ తీసుకోలేదు. దీంతో దీని అమలుపై ఏడాదిగా బ్యాంక్ సంఘాలు నిరసన చేపడుతున్నాయి. అయితే ప్రభుత్వం స్పందించడం లేదు. కేంద్రం నుంచి ఎటువంటి స్పందన రాకపోవడంతో ఆందోళనలను తీవ్రతరం చేయాలని బ్యాంక్ సంఘాలు నిర్ణయించాయి. అందులో భాగంగా సమ్మెకు దిగుతున్నాయి. ప్రస్తుతం బ్యాంకుల్లో 2,4వ శనివారాల్లో సెలవులు అమల్లో ఉన్నాయి. నెలలో మిగిలిన శనివారాల్లో కూడా సెలవులు ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు.

# కాంగ్రెస్‌పై వ్యతిరేకత

మొదటి పేజీ తరువాయి

కార్పొరేట్ శక్తుల చేతిలో బందీ కానివ్వబోమని ఉద్ఘాటించారు. తాను కూడా ఫోన్ ట్యాపింగ్ బాధితుడినేనని ఆయన వెల్లడించారు. అక్రమంగా ఫోన్ ట్యాపింగ్ చేసినప్పుడు లేని భయం, విచారణ సమయంలో ఎందుకు వచ్చిందని ప్రశ్నించారు. అమరవీరుల త్యాగంతో సాధించిన తెలంగాణలో ప్రజలు పదేళ్లు అధికారమిస్తే బీఆర్ఎస్ ప్రభుత్వం అవినీతికి పాల్పడిందని ఆయన విమర్శించారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో కేసీఆర్ కుటుంబం తప్ప ఎవరూ బాగుపడలేదని దుయ్యబట్టారు. ప్రజా సమస్యల పరిష్కారంలో తెలంగాణ జన సమితి కార్యకర్తలు అంకితభావంతో పనిచేయాలని ఆయన పిలుపునిచ్చారు. 2023 అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి మద్దతు ఇవ్వడానికి మూడు కారణాలు ఉన్నాయని ఆయన పేర్కొన్నారు. కేసీఆర్ నిరంకుశ పాలన అంతం కావాలని, ఉద్యమ ఆకాంక్షల సాధన కోసం ఒక ప్రయత్నం జరగాలని, ప్రభుత్వంలో తమకు భాగస్వామ్యం ఉండాలని కోరుకున్నామని ఆయన అన్నారు. ఈ కారణాల వల్లే తామంతా కలిసి కాంగ్రెస్ ప్రభుత్వానికి మద్దతు పలికామని కోదండరాం తెలిపారు.

# నేడు కేంద్ర అఖిలపక్ష భేటీ

మొదటి పేజీ తరువాయి

బడ్జెట్‌ను ప్రవేశపెట్టడం ఇదే తొలిసారి. జనవరి 28 నుంచి ఏప్రిల్ 2వ తేదీ వరకూ రెండు దశల్లో పార్లమెంట్ బడ్జెట్ సమావేశాలు కొనసాగనున్నాయి. జనవరి 28 నుంచి ఫిబ్రవరి 13 వరకు తొలి విడత బడ్జెట్ సమావేశాలు నిర్వహిస్తుండగా, మార్చి 9వ తేదీ నుంచి ఏప్రిల్ 2వ తేదీ వరకూ రెండో విడత బడ్జెట్ సమావేశాలు నిర్వహిస్తారు.



# రేవంత్ ఆబ్సెంట్

మొదటి పేజీ తరువాయి

చెందిన కెనెడీ స్కూల్ లో సోమవారం ఉదయం ఏడుగంటలకే తరగతులు ప్రారంభం కాగా సాయంత్రం 6 గంటలవరకు కొనసాగాయి. దావోస్ లో మూడు రోజుల పర్యటన పూర్తిచేసుకున్న తర్వాత హార్వర్డ్ యూనివర్సిటీలో లీడర్ షిప్ కోర్సుకోసం సీఎం రేవంత్ రెడ్డి అమెరికా బయలుదేరి వెళ్లారు. జనవరి 30 వరకు అమెరికాలో సీఎం పర్యటన కొనసాగనుంది. సీఎం రేవంత్ రెడ్డి విద్యార్థిగా మారి.. హార్వర్డ్ యూనివర్సిటీలో లీడర్ షిప్ పై సర్టిఫికెట్ కోర్సుఅభ్యసిస్తున్నారు. హార్వర్డ్ యూనివర్సిటీ నుంచి సర్టిఫికెట్ కోర్సు చేస్తున్న తొలి సీఎంగా అరుదైన ఘనత దక్కించుకోనున్నారు.

# రైజింగ్.. మా నినాదం

మొదటి పేజీ తరువాయి

క్రమంలో తెలంగాణ రాష్ట్రం కూడా 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా రాష్ట్రాన్ని తీర్చిదిద్దాలన్న మహత్తర లక్ష్యాన్ని నిర్దేశించుకుంది. గత డిసెంబరులో జరిగిన తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్‌లో ప్రపంచ ప్రతినిధుల మధ్య ప్రభుత్వం ఈ దార్శనిక పత్రాన్ని ఆవిష్కరించింది. క్యూర్, ప్యూర్, రేర్‌తో తెలంగాణలో సమగ్ర అభివృద్ధికి కృషిచేయాలని ప్రభుత్వం భావిస్తోంది. డిసెంబర్ 9న తెలంగాణ తల్లి అవతరణ దినోత్సవాన్ని జరుపుకొంటూ, జిల్లా కలెక్టరేట్‌లలో తెలంగాణ తల్లి విగ్రహాలను ప్రతిష్ఠించుకున్నాం' అని అన్నారు.

రైతుల సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యం

మేడారం సమ్మక్క-సారలమ్మ మహాజాతరకు శాశ్వత మౌలిక వసతుల కోసం రూ.251 కోట్లను ప్రభుత్వం మంజూరు చేసి, అభివృద్ధి చేస్తోందని గవర్నర్ తెలిపారు. 'రైతుల సంక్షేమానికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యమిస్తోంది. వ్యవసాయ రంగానికి 24 గంటల నాణ్యమైన విద్యుత్తును సరఫరా చేస్తోంది. రూ.2 లక్షల వరకు రైతు రుణాలను మాఫీ చేయడం ద్వారా రూ.20,617 కోట్ల వ్యయంతో సుమారు 26 లక్షల మంది రైతులకు లబ్ధి చేకూర్చింది. రైతు భరోసా పథకం కింద ఎకరాకు సంవత్సరానికి అందించే సాయాన్ని కొనసాగిస్తోంది ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో 14.24 లక్షల మంది రైతుల నుంచి సుమారు 72 లక్షల మెట్రిక్ టన్నుల వరి ధాన్యం కొనుగోలు చేసింది. ఇప్పటివరకు రూ.17,079.50 కోట్ల చెల్లింపులు జరిగాయి. అదనంగా రూ.1,453 కోట్లను బోనస్ సబ్సిడీగా పంపిణీ చేశారు. ఉస్మానియా జనరల్ హాస్పిటల్ కోసం రూ.2,700 కోట్ల వ్యయంతో 27 ఎకరాల్లో ప్రభుత్వం అత్యాధునిక కొత్త ఆసుపత్రిని నిర్మిస్తోంది. ప్రభుత్వం ఏర్పడిన తర్వాత వైద్య ఆరోగ్య రంగంలో రూ.16,521 కోట్లు ఖర్చు చేసింది. ఉచితంగా సన్నబియ్యాన్ని అందిస్తున్న ఏకైక రాష్ట్రం తెలంగాణ. రూ.1.03 కోట్ల కుటుంబాలకు రేషన్ కార్డుల ద్వారా 3.34 కోట్ల మందికి లబ్ధి చేకూరుతోంది. ప్రతి నెల 2.10 లక్షల మెట్రిక్ టన్నుల సన్నబియ్యం పంపిణీ అవుతోంది. ప్రతి అసెంబ్లీ నియోజకవర్గానికి 3,500 ఇళ్ల చొప్పున మొదటి దశలో రాష్ట్రవ్యాప్తంగా 4.5 లక్షల ఇళ్లను ప్రభుత్వం మంజూరు చేసింది. నిధులు నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లో జమ అవుతున్నాయి. హెచ్ఐఎల్‌టీ విధానంతో కాలుష్య పరిశ్రమలను నగరం బయటకు తరలించే ప్రక్రియను చేపట్టాం. ముచ్చర్ల, కందుకూరు ప్రాంతాల్లో 30,000 ఎకరాల్లో భారత్ ఫ్యూచర్ సిటీని ఏర్పాటు చేస్తోంది. ఇది నెట్-జీరో స్మార్ట్ సిటీగా రూపుదిద్దుకోనుంది. మూసీ నది పునరుజ్జీవనానికి 55 కి.మీ. మాస్టర్ ప్లాన్‌ను రూపొందించాం. చెరువుల ఆక్రమణల నివారణకు హైడ్రాను తీసుకువచ్చారు. అంబర్‌పేట్ బతుకమ్మ కుంటను పునరుద్ధరించాం. హ్యామ్ మోడల్‌లో



12,000 కి.మీ రహదారుల అభివృద్ధికి రూ.11,399 కోట్లను మంజూరు చేశారయ్యాయి. గ్రామీణ రహదారులకు ప్రభుత్వం రూ.16,007 కోట్లను ప్రతిపాదనలు చేసింది' అని పేర్కొన్నారు.

# రేవంత్ చెప్పే వెళ్లారు!

## సీఎం విదేశీ పర్యటనపై తెలంగాణ ఫ్యాక్ట్ చెక్ విభాగం వివరణ



హైదరాబాద్, జనవరి 26 (ఈవార్తలు): ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారిక విదేశీ పర్యటనలో ఎలాంటి సమాచారం లేకుండా వ్యక్తిగత పర్యటనపై వెళ్లారని సామాజిక మాధ్యమాల్లో జరుగుతున్న ప్రచారంపై తెలంగాణ ఫ్యాక్ట్ చెక్ విభాగం స్పందించింది. 'తెలంగాణ ముఖ్యమంత్రి విదేశీ పర్యటనపై తప్పుడు ప్రచారం' అంటూ 'ఎక్స్' వేదికగా వివరణ ఇచ్చింది. ఆరోపణలు పూర్తిగా నిరాధారమైనవని, దురుద్దేశపూర్వకంగా చేసిన ప్రచారమే అని తెలిపింది. ఇలాంటి తప్పుడు సమాచారాన్ని ప్రచారం చేయడం ద్వారా ముఖ్యమంత్రి అధికారికంగా ఆమోదించిన పర్యటనకు సంబంధించిన వాస్తవాలను వక్రీకరించి, ప్రజలను తప్పుదారి పట్టించి గందరగోళం సృష్టించేందుకు ఉద్దేశపూర్వకంగా చేసిన ప్రయత్నం ఇది అని పేర్కొంది. ముఖ్యమంత్రి న్యూయార్క్ పర్యటన పూర్తిగా అధికారికమేనని, అన్ని విధివిధానాలకు అనుగుణంగా సమన్వయంతో నిర్వహించారని పేర్కొంది. ముఖ్యమంత్రి విదేశీ పర్యటనను ముందుగానే అధికారికంగా తెలియజేసి, నిబంధనల ప్రకారమే నిర్వహించారని తెలంగాణ ఫ్యాక్ట్ చెక్ విభాగం తెలిపింది. విదేశీ పర్యటనకు అవసరమైన అన్ని అనుమతులను ముందుగానే కేంద్ర ప్రభుత్వం నుంచి పొందినట్లు వెల్లడించింది. దావోస్ నుంచి అమెరికా చేరుకున్న అనంతరం, న్యూయార్క్ విమానాశ్రయంలో భారత విదేశాంగ మంత్రిత్వ శాఖ(ఎంఈఏ) అధికారులు ముఖ్యమంత్రికి స్వాగతం పలికారని తెలిపింది. న్యూయార్క్‌లో ముఖ్యమంత్రి ప్రయాణానికి ఎంఈఏ అధికారిక వాహనాన్ని ఏర్పాటు చేసిందని, ఇది సాధారణ దౌత్య విధానాల్లో భాగమేనని తెలిపింది. శీతాకాలంలో తీవ్ర మంచు తుపానుల హెచ్చరికలు ఉన్న నేపథ్యంలో విమాన ప్రయాణం చేయవద్దని ఎంఈఏ ముఖ్యమంత్రిని ఆదేశించిందని, వారి తదుపరి ప్రయాణాన్ని రోడ్డు మార్గంలో చేపట్టాలని తెలిపిందని గుర్తు చేసింది. ఎంఈఏ సూచనల మేరకు, బోస్టన్ వరకు రోడ్డు మార్గంలో ప్రయాణాన్ని ఎంఈఏనే ఏర్పాటు చేసిందని, ఇందులో హార్వర్డ్ యూనివర్సిటీ క్యాంపస్ వరకు ముఖ్యమంత్రి ప్రయాణం కూడా ఉందని తెలిపింది. ఉన్నతస్థాయి విద్యా సంస్థ నిర్దేశించిన కార్యక్రమాలపై పూర్తిగా దృష్టి సారించాల్సిన అవసరం ఉండటంతో, ఈ కాలంలో ఉద్దేశ్య పూర్వకంగానే ముఖ్యమంత్రి తన కార్యక్రమాలను నిరాడంబరంగా ఉంచినట్లు ఫ్యాక్ట్ చెక్ విభాగం తెలిపింది. సోషల్ మీడియాలో ప్రచారం అవుతున్న ఆరోపణలు పూర్తిగా అవాస్తవమైనవి, బాధ్యతారహితమైనవి, అలాగే ప్రజలను తప్పుదారి పట్టించేందుకు చేసిన ప్రయత్నాలు మాత్రమేనని పేర్కొంది. దయచేసి ప్రజలు ఇలాంటి తప్పుడు సమాచారాన్ని నమ్మవద్దని విజ్ఞప్తి చేసింది. అధికారులు చేసే ప్రకటనలను మాత్రమే పరిగణలోకి తీసుకోవాలని సూచించింది.

## బీజేపీకి ఆరూరి రమేశ్ గుడ్ బై

**తెలంగాణలో బీజేపీకి భారీ షాక్**

**త్వరలో బీఆర్ఎస్ చేరనున్నట్లు వెల్లడి**

వరంగల్, జనవరి 26 (ఈవార్తలు): ఉమ్మడి వరంగల్ జిల్లాలో బీజేపీకి గట్టి ఎదురుదెబ్బ తగిలింది. వర్ధన్నపేట మాజీ శాసనసభ్యుడు ఆరూరి రమేశ్ పార్టీకి రాజీనామా చేశారు. త్వరలో తాను బీఆర్ఎస్ పార్టీలో చేరనున్నట్లు ప్రకటించారు. ఈ మేరకు ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. బీజేపీ ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేస్తున్నానని, బీఆర్ఎస్ ఆహ్వానం మేరకు తన ఇంటి పార్టీ అయిన బీఆర్ఎస్‌లోకి త్వరలో వెళుతున్నానని ఆయన పేర్కొన్నారు. పలువురు నాయకులు, అనుచరులతో కలిసి త్వరలో బీఆర్ఎస్‌లో చేరతానని వెల్లడించారు. ఇంతకాలం తనకు సహకరించిన బీజేపీ పెద్దలకు, నాయకులకు, కార్యకర్తలకు ఆయన కృతజ్ఞతలు తెలియజేశారు. ఆయన ఎల్లుండి బీఆర్ఎస్‌లో చేరే అవకాశం ఉంది. ఆరూరి రమేశ్ గత లోక్ సభ ఎన్నికల్లో బీజేపీ నుంచి పోటీ చేసి రెండో స్థానంలో నిలిచారు. గతంలో ఆయన బీఆర్ఎస్ వరంగల్ జిల్లా అధ్యక్షుడిగా పనిచేశారు. లోక్ సభ ఎన్నికలకు ముందు ఆయన బీజేపీలో చేరారు. ఇప్పుడు తిరిగి బీఆర్ఎస్ పార్టీలో చేరనున్నారు.

## మూడు రంగుల జెండాతో అసదుద్దీన్

**ట్రయంఫ్ బైక్‌పై పాతబస్తీలో పర్యటన**

హైదరాబాద్, జనవరి 26 (ఈవార్తలు): గణతంత్ర దినోత్సవం సందర్భంగా మజ్లిస్ పార్టీ అధ్యక్షుడు, హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ మజ్లిస్ పార్టీ కార్యాలయం, మదీనా చౌరస్తాలో జాతీయ జెండాను ఎగురవేశారు. అనంతరం ఆయన ట్రయంఫ్ బైక్‌పై పాతనగరంలో పర్యటించారు. బైక్‌పై రెండు చిన్న జాతీయ జెండాలను అమర్చుకుని, పాతబస్తీలోని పలు ప్రాంతాల్లో జరిగిన గణతంత్ర దినోత్సవ వేడుకల్లో పాల్గొన్నారు. పాతబస్తీలో తన పర్యటనకు సంబంధించిన వీడియోను అసదుద్దీన్ ఒవైసీ తన 'ఎక్స్' ఖాతాలో పంచుకున్నారు. ఈ వీడియోకు ఆయన తన ప్రసంగంలోని కొంత భాగాన్ని, అజయ్ దేవగణ్, సంజయ్ దత్ నటించిన 'భుజ్: ది ప్రైడ్ ఆఫ్ ఇండియా' చిత్రంలోని 'యే దేశ్ మేరే' పాటను జత చేశారు. 1971లో భారత్, పాకిస్థాన్ మధ్య జరిగిన యుద్ధం నేపథ్యంగా ఈ చిత్రం రూపొందిన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా ఆయన గణతంత్ర దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. "నా తోటి భారతీయులకు గణతంత్ర దినోత్సవ శుభాకాంక్షలు. స్వాతంత్రానంతరం భారతదేశాన్ని మన పెద్దలు గణతంత్ర రాజ్యంగా నిలపాలని ఆకాంక్షించారు. నియంతృత్వ పాలన, మెజారిటీ రాజ్య పాలనను వారు కోరుకోలేదు. గణతంత్రంలో ప్రతి స్వరం ముఖ్యమైనది. మన భారతదేశం అందరికీ నిలయంగా ఉండాలని, స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వం, న్యాయం కేవలం హామీలుగా కాకుండా వాస్తవ రూపం దాల్చాలని నేను ప్రార్థిస్తున్నాను" అని పేర్కొన్నారు.

## సంతోష్‌కు నోటీసులపై హరీశ్ ఫైర్

హైదరాబాద్, జనవరి 26 (ఈవార్తలు): ఫోన్ ట్యాపింగ్ కేసులో బీఆర్ఎస్ మాజీ ఎంపీ సంతోష్ కుమార్‌కు సిట్ నోటీసులు జారీ చేయడంపై ఆ పార్టీ సీనియర్ నేత, మాజీ మంత్రి హరీశ్ రావు తీవ్రంగా స్పందించారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వంలో సిట్ నోటీసులను రాజకీయ కక్ష సాధింపు కోసం ఒక ఆయుధంగా వాడుకోవడం పరిపాటిగా మారిందని ఆయన ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వ అవినీతి, దోపిడీని ఆధారాలతో సహా బయటపెట్టేందుకు బీఆర్ఎస్ నేతల బృందం మంగళవారం సాయంత్రం గవర్నర్‌ను కలవనున్న నేపథ్యంలో, ప్రజల దృష్టిని మరల్చేందుకే సోమవారం మధ్యాహ్నం 3 గంటలకు హడావుడిగా సంతోష్ కుమార్‌కు నోటీసులు ఇచ్చారని హరీశ్ రావు విమర్శించారు. గతంలో తాను బొగ్గు కుంభకోణం అంశాన్ని బయటపెట్టినప్పుడు తనకూ నోటీసులు ఇచ్చారని, అదే అంశాన్ని కేటీఆర్ ప్రస్తావించినప్పుడు ఆయనకూ సిట్ నోటీసులు పంపారని హరీశ్ రావు గుర్తుచేశారు. ఇది కేవలం ప్రభుత్వాన్ని ప్రశ్నించే వారిపై కక్ష సాధించడమేనని అన్నారు. ప్రభుత్వం అనుసరిస్తున్న ఈ రాజకీయాలను ప్రజలు నిశితంగా గమనిస్తున్నారని, బొగ్గు కుంభకోణం వెనుక ఉన్న నిజాలు బయటకు వస్తూనే ఉన్నాయని హరీశ్ రావు పేర్కొన్నారు.

## మంత్రి కోమటిరెడ్డితో అర్వింద్ భేటీ

హైదరాబాద్, జనవరి 26 (ఈవార్తలు): తెలంగాణ రాష్ట్ర మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డితో నిజామాబాద్ బీజేపీ ఎంపీ ధర్మపురి అరవింద్ సమావేశమయ్యారు. నియోజకవర్గానికి సంబంధించిన ఒక పని నిమిత్తం తాను మంత్రిని కలిశానని, దానికి ఆయన సానుకూలంగా స్పందించారంటూ కృతజ్ఞతలు తెలిపారు. మంత్రిని కలిసిన విషయాన్ని ఎంపీ ధర్మపురి అరవింద్ సామాజిక మాధ్యమాల్లో పంచుకున్నారు. గత 15 నెలలుగా పెండింగ్‌లో ఉన్న మాధవ్ నగర్ ఆర్ఓబీ 193కి సవరించిన అదనపు రూ.8.68 కోట్లకు పరిపాలన అనుమతులు మంజూరు చేయాలని తాను మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డిని ఆయన కార్యాలయంలో కలిసి విజ్ఞప్తి చేశానని ఆయన పేర్కొన్నారు. తన విజ్ఞప్తికి మంత్రి సానుకూలంగా స్పందించారని తెలిపారు. తక్షణమే మంజూరు ఉత్తర్వులను జారీ చేయాలని సంబంధిత అధికారులకు ఆదేశాలు కూడా జారీ చేశారని వెల్లడించారు.

## సామాన్య ప్రేక్షకుడికి దక్కిన గౌరవం


**పద్మశ్రీ పురస్కారంపై రాజేంద్ర ప్రసాద్**

హైదరాబాద్, జనవరి 26 (ఈవార్తలు): ప్రముఖ నటుడు, నటకిరీటి రాజేంద్ర ప్రసాద్‌కు కేంద్ర ప్రభుత్వం 'పద్మశ్రీ' పురస్కారాన్ని ప్రకటించడంపై ఆయన హర్షం వ్యక్తం చేశారు. ఇది తన పూర్వజన్మ సుకృతంగా భావిస్తున్నానని, తన జీవితంలో ఈ రోజును ఎప్పటికీ మర్చిపోలేనని అన్నారు. ఈ మేరకు సోమవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ గౌరవం కేవలం తనకు మాత్రమే కాదని, తెలుగు హాస్యానికి, వినోదాన్ని ఆస్వాదించే సామాన్య ప్రేక్షకుడికి దక్కిన గొప్ప గౌరవంగా భావిస్తున్నానని రాజేంద్ర ప్రసాద్ పేర్కొన్నారు. కళలను గౌరవించి, తనను ఈ పురస్కారానికి ఎంపిక చేసిన కేంద్ర ప్రభుత్వానికి, జ్యూరీ సభ్యులకు ఆయన హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. గత 48 ఏళ్లుగా ప్రేక్షకులు అందిస్తున్న ప్రేమే ఈ స్థాయి గుర్తింపునకు కారణమని ఆయన అన్నారు. "నాలాంటి నటుడిని మీ ఇంటి మనిషిలా ఆదరించి, 'నటకిరీటి'ని చేసి, ఈ స్థాయికి తీసుకువచ్చింది మీ చప్పట్లే. ఆ రుణం నేను ఎప్పటికీ తీర్చుకోలేను" అని రాజేంద్ర ప్రసాద్ భావోద్వేగంగా వ్యాఖ్యానించారు. తనను ఎప్పుడూ నవ్విస్తూ ఉండమని దీవించిన ప్రేక్షక దేవుళ్లకు శిరస్సు వంచి నమస్కరిస్తున్నట్లు ఆయన తన ప్రకటనలో పేర్కొన్నారు.

## ప్రతి 20 నిమిషాలకు ఒక భారతీయుడు అరెస్ట్

**అమెరికా పోలీసులకు పట్టుబడుతున్న ఇండియన్స్**

వాషింగ్టన్: అమెరికాలోకి అక్రమంగా ప్రవేశించే వలసదారుల్లో భారతీయుల సంఖ్యే ఎక్కువని తాజా నివేదికల్లో బయటపడింది. అక్రమంగా సరిహద్దులు దాటి పెద్ద సంఖ్యలో భారతీయులు పట్టుబడుతున్నారని తేలింది. యూఎస్ కస్టమ్స్ అండ్ బోర్డర్ పోలీస్ నివేదిక ప్రకారం.. గతేడాది సగటున ప్రతీ 20 నిమిషాలకు ఓ భారతీయుడిని అరెస్టు చేసినట్లు సమాచారం. మొత్తంగా 2025 లో 23,830 మంది భారతీయులు సరిహద్దుల వద్ద పట్టుబడ్డారని పోలీసులు తెలిపారు. 2024 ఏడాదిలో ఇదేవిధంగా 85,119 మందిని అరెస్టు చేసినట్లు వివరించారు. కాగా, అమెరికా అధ్యక్షుడిగా డొనాల్డ్ ట్రంప్ బాధ్యతలు స్వీకరించాక ఇమ్మిగ్రేషన్ చట్టాలను కఠినంగా మార్చిన విషయం తెలిసిందే. అక్రమ వలసలపై అత్యంత కఠినంగా వ్యవహరించాలని బోర్డర్ పోలీసులకు ఆయన ఆదేశాలు జారీ చేశారు. దీంతో చాలావరకు అక్రమ వలసలను అధికారులు కట్టడి చేశారు. శిక్షలకు భయపడి బోర్డర్ దాటేందుకు చాలామంది సాహసించడంలేదు. అయినప్పటికీ భారతీయులు మాత్రం ఎలాగైనా అమెరికాలో అడుగుపెట్టాలని బోర్డర్ క్రాస్ చేసేందుకు తెగిస్తున్నారని ఆరోపించారు. బోర్డర్ దాటుతూ పట్టుబడ్డ భారతీయుల్లో యువతే ఎక్కువని, ఉద్యోగం కోసం, మంచి వేతనం కోసం వారు ఈ సాహసానికి పాల్పడుతున్నారని పోలీసులు తెలిపారు.



## నైనీ కోల్ బ్లాక్‌పై బీఆర్ఎస్ ఫిర్యాదు

**నేడు గవర్నర్‌ను కలవనున్న కేటీఆర్ బృందం**

హైదరాబాద్, జనవరి 26 (ఈవార్తలు): గవర్నర్ జిష్ణుదేవ్ వర్మను బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ నేతృత్వంలోని ప్రతినిధి బృందం మంగళవారం కలవనుంది. సింగరేణి వ్యవహారంపై వారు గవర్నర్‌కు సమగ్ర వివరాలు అందజేయనున్నారు. సింగరేణిలో భారీ కుంభకోణం జరిగిందని, ఇందులో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉపముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క, ఇతర మంత్రుల పాత్ర ఉందని ఆరోపిస్తూ వారు సాక్ష్యాధారాలతో కూడిన నివేదికను గవర్నర్‌కు సమర్పించనున్నారు. సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్ టెండర్ల ప్రక్రియలో భారీ కుంభకోణం జరిగిందని బీఆర్ఎస్ ఆరోపిస్తోంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బంధువు సృజన్ రెడ్డికి లబ్ధి చేకూర్చేలా సింగరేణి టెండర్ల నిబంధనలను మార్చారని కేటీఆర్ ఆరోపిస్తున్నారు. సుమారు రూ.6 వేల కోట్ల విలువైన టెండర్లలో అవకతవకలు జరిగాయని బీఆర్ఎస్ ఆరోపిస్తోంది. గతంలో ఎన్నడూ లేని విధంగా సైట్ విజిట్ సర్టిఫికెట్ నిబంధనను తీసుకువచ్చి, తమకు కావలసిన సంస్థలకే టెండర్లు దక్కేలా చేశారని ఆరోపిస్తున్నారు. సింగరేణికి రావాల్సిన లాభాలను పక్కదారి పట్టించి, ఎన్నికల ఖర్చులు, వ్యక్తిగత ప్రయోజనాలకు ఉపయోగించుకుంటున్నారని గవర్నర్‌కు ఫిర్యాదు చేయనున్నారు. సింగరేణి టెండర్ల ప్రక్రియపై సిట్టింగ్ జడ్జితో లేదా హైకోర్టు న్యాయమూర్తితో లేదా సీబీఐతో పూర్తిస్థాయి విచారణ జరిపించాలని బీఆర్ఎస్ డిమాండ్ చేస్తోంది.

## రాష్ట్రంలో ఘనంగా రిపబ్లిక్ డే వేడుకలు

హైదరాబాద్, జనవరి 26 (ఈవార్తలు): తెలంగాణ వ్యాప్తంగా 77వ గణతంత్ర దినోత్సవ వేడుకలు ఘనంగా జరుగుతున్నాయి. సికింద్రాబాద్‌లోని పరేడ్ గ్రౌండ్స్‌లో నిర్వహించిన రాష్ట్రస్థాయి అధికారిక కార్యక్రమంలో గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ జాతీయ జెండాను ఆవిష్కరించారు. అనంతరం ఆయన సాయుధ దళాల గౌరవ వందనం స్వీకరించారు. ఈ వేడుకలకు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, శ్రీధర్ బాబు, శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్, మండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి హాజరయ్యారు. అంతకుముందు తెలంగాణ అసెంబ్లీ ప్రాంగణంలో స్పీకర్ గడ్డం ప్రసాద్, శాసనమండలిలో ఛైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి జాతీయ పతాకాన్ని ఎగురవేశారు. రాష్ట్ర సచివాలయంతో పాటు జిల్లా కేంద్రాలు, ప్రభుత్వ కార్యాలయాలు, విద్యాసంస్థల్లోనూ రిపబ్లిక్ డే వేడుకలను ఉత్సాహంగా నిర్వహించారు. ఈ సందర్భంగా దేశం కోసం ప్రాణాలర్పించిన స్వాతంత్ర్య సమరయోధులను, రాజ్యాంగ నిర్మాతలను స్మరించుకున్నారు. రాష్ట్రవ్యాప్తంగా అన్ని ప్రాంతాల్లో దేశభక్తి వాతావరణం నెలకొంది.




## అర్ధరాత్రి చెరువులో 9 మంది స్టక్!

**కాపాడిన హైడ్రా-డీఆర్ఎఫ్**



హైదరాబాద్, జనవరి 26 (ఈవార్తలు): హైదరాబాద్‌లోని మిరాలం చెరువులో చిక్కుకుపోయిన 9 మందిని హైడ్రా-డీఆర్ఎఫ్ బృందాలు సురక్షితంగా కాపాడాయి. ఆదివారం అర్ధరాత్రి బోటు ఇంజన్ మొరాయించడంతో చెరువు మధ్యలోనే ఉండిపోయిన ఇంజనీర్లు, కార్మికులను సిబ్బంది ఒడ్డుకు చేర్చారు. పాతబస్తీలోని జూ పార్కు సమీపంలో చోటుచేసుకున్న ఈ ఘటన, తీవ్ర ఉత్కంఠకు దారితీసింది. వివరాల్లోకి వెళితే... మిరాలం చెరువుపై నిర్మించతలపెట్టిన వంతెన కోసం సాయిల్ టెస్ట్ చేసేందుకు కొంతమంది ఇంజనీర్లు, కార్మికులు ఆదివారం ఉదయం బోటులో చెరువులోకి వెళ్లారు. పనులు ముగించుకుని సాయంత్రం తిరిగి వస్తుండగా, చీకటి పడే సమయానికి వారు ప్రయాణిస్తున్న బోటు ఇంజన్ ఆగిపోయింది. దాన్ని బాగుచేయడానికి ప్రయత్నించినా ఫలితం లేకపోయింది. ఒడ్డున ఉన్న మెకానిక్‌కు ఫోన్ చేయగా, బోటు ఒడ్డుకు వస్తేనే బాగుచేయగలనని చెప్పడంతో వారిలో ఆందోళన మొదలైంది. బోటును చేతులతో నెట్టుకుంటూ ఒడ్డుకు వద్దామని ప్రయత్నించగా, చెరువులో దట్టంగా పెరిగిన గుర్రపు డెక్క అడ్డుగా మారింది. దీంతో బోటు ముందుకు కదలలేదు. చుట్టూ చిమ్మచీకటి, మరోవైపు ఆ చెరువులో మొసళ్లు ఉంటాయనే భయంతో వారు ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని గడిపారు. ఏం చేయాలో పాలుపోని స్థితిలో వెంటనే డయల్ 100కు ఫోన్ చేసి సమాచారం అందించారు. పోలీసుల ద్వారా విషయం తెలుసుకున్న డీఆర్ఎఫ్ కంట్రోల్ రూమ్ వెంటనే స్పందించింది. హైడ్రా ఎస్ఎఫ్ఓ జమీల్, రెస్క్యూ టీమ్ ఇన్‌చార్జి స్వామి నేరుగా చెరువులో చిక్కుకున్నవారితో ఫోన్‌లో మాట్లాడారు. "మేము వస్తున్నాం, ఎంత రాత్రైనా మిమ్మల్ని సురక్షితంగా బయటకు తీసుకొస్తాం, ధైర్యంగా ఉండండి" అని భరోసా ఇచ్చారు. దట్టమైన చీకటి, గుర్రపు డెక్క కారణంగా బాధితులు ఉన్న ప్రదేశాన్ని గుర్తించడం డీఆర్ఎఫ్ సిబ్బందికి సవాలుగా మారింది. బాధితులు తమ సెల్ ఫోన్ లైట్ల ద్వారా సిగ్నల్ ఇవ్వగా, డీఆర్ఎఫ్ బృందాలు టార్చ్ లైట్ల సాయంతో అతి కష్టం మీద వారి వద్దకు చేరుకున్నాయి. మొదటి విడతలో నలుగురిని, ఆ తర్వాత రెండో విడతలో మిగిలిన ఐదుగురిని సురక్షితంగా ఒడ్డుకు చేర్చారు. ఒడ్డుకు చేరడంతో బాధితులంతా ఊపిరి పీల్చుకున్నారు. ప్రాణాపాయ స్థితిలో తమను కాపాడిన హైడ్రా-డీఆర్ఎఫ్ బృందాలకు కన్నీళ్లతో కృతజ్ఞతలు తెలిపారు. నిరంతరం ఫోన్‌లో మాట్లాడుతూ ధైర్యం చెప్పడమే కాకుండా, సాహసోపేతంగా తమను కాపాడారని కార్మికులు, స్థానికులు కొనియాడారు.

## అక్రెడిటేషన్ ఉంటేనే 'ప్రెస్' స్టిక్కర్లు!

**నకిలీ జర్నలిస్టులపై సర్కార్ ఉక్కుపాదం**




హైదరాబాద్, జనవరి 26 (ఈవార్తలు): మీడియా ముసుగులో చెలామణి అవుతున్న నకిలీ జర్నలిస్టులకు అడ్డుకట్ట వేసేందుకు తెలంగాణ ప్రభుత్వం సంచలన నిర్ణయం తీసుకుంది. ఇకపై రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన అధికారిక అక్రిడిటేషన్ కార్డు ఉన్న జర్నలిస్టులు మాత్రమే తమ వాహనాలపై 'ప్రెస్' స్టిక్కర్‌ను ఉపయోగించాలని స్పష్టం చేసింది. ఈ మేరకు రాష్ట్ర సమాచార, పౌర సంబంధాల శాఖ కమిషనర్ అధికారికంగా ఉత్తర్వులు జారీ చేశారు. క్షేత్రస్థాయిలో కొందరు కేవలం యూట్యూబ్ ఛానెళ్లు లేదా ఇతర ప్రైవేటు సంస్థల ఐడీ కార్డులను చూపిస్తూ వాహనాలపై 'ప్రెస్' స్టిక్కర్లను విరివిగా వాడుతున్నారని, దీనివల్ల అసలైన జర్నలిస్టుల ప్రతిష్ఠకు భంగం కలుగుతోందని వచ్చిన ఫిర్యాదుల నేపథ్యంలో ప్రభుత్వం ఈ కఠిన చర్యలు చేపట్టింది. సెంట్రల్ మోటార్ వెహికల్ చట్టం-1989 ప్రకారం వాహనాలపై లేదా నంబర్ ప్లేట్లపై అనధికారికంగా 'ప్రెస్', 'పోలీస్', 'గవర్నమెంట్' వంటి పదాలను వాడటం చట్టరీత్యా నేరం. ఈ కొత్త నిబంధనలను అతిక్రమించి అక్రిడిటేషన్ లేకుండా 'ప్రెస్' స్టిక్కర్లను వాడితే ట్రాఫిక్ నిబంధనల ఉల్లంఘనగా పరిగణిస్తారు. అలాంటి వ్యక్తులకు భారీ జరిమానాతో పాటు అవసరమైతే వాహనాన్ని సీజ్ చేసే అధికారం కూడా రవాణా శాఖకు ఉందని అధికారులు హెచ్చరించారు. అక్రిడిటేషన్ లేని వారు తమ వాహనాలపై ఉన్న స్టిక్కర్లను వెంటనే తొలగించుకోవాలని సూచించారు. లేనిపక్షంలో పోలీస్ మరియు రవాణా శాఖల సమన్వయంతో రాష్ట్రవ్యాప్తంగా స్పెషల్ డ్రైవ్‌లు నిర్వహించి కేసులు నమోదు చేయనున్నట్లు తెలిపారు. ఈ నిర్ణయంతో టోల్ ప్లాజాలు, పార్కింగ్ ప్రదేశాలు, ప్రభుత్వ కార్యాలయాల్లో నకిలీ జర్నలిస్టుల వల్ల తలెత్తుతున్న గందరగోళానికి తెరపడుతుందని ప్రభుత్వం భావిస్తోంది. అయితే, అక్రిడిటేషన్ లేని నిజమైన ఫీల్డ్ రిపోర్టర్లకు ఇది కొంత ఇబ్బంది కలిగించే అవకాశమున్నప్పటికీ, జర్నలిజం వృత్తి గౌరవాన్ని కాపాడేందుకు ఈ చర్య అవసరమని పలువురు సీనియర్ జర్నలిస్టులు అభిప్రాయపడుతున్నారు.



## మంత్రి వాకిటికి తప్పిన ప్రమాదం

నారాయణపేట, జనవరి 26 (ఈవార్తలు): నారాయణపేట జిల్లా మక్తల్‌లో గణతంత్ర దినోత్సవ వేడుకల సందర్భంగా అపశ్రుతి చోటుచేసుకుంది. రాష్ట్ర మంత్రి వాకిటి శ్రీహరి జాతీయ జెండాను ఎగురవేస్తుండగా, జెండా కర్ర విరిగిపడటంతో ప్రమాదం త్రుటిలో తప్పింది. ఈ ఘటనలో మంత్రి సురక్షితంగా బయటపడగా, మరొక వ్యక్తికి స్వల్ప గాయాలయ్యాయి. వివరాల్లోకి వెళితే... 77వ గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం మక్తల్ తహశీల్దార్ కార్యాలయంలో అధికారిక కార్యక్రమం ఏర్పాటు చేశారు. ముఖ్య అతిథిగా హాజరైన మంత్రి శ్రీహరి, మువ్వన్నెల జెండాను ఆవిష్కరించేందుకు తాడును లాగారు. అదే సమయంలో బరువును తట్టుకోలేక జెండా కర్ర మధ్యలోకి విరిగిపోయింది. విరిగిన కర్ర మంత్రిపై పడబోతుండగా, ఆయన అప్రమత్తమై వెంటనే పక్కకు తప్పుకున్నారు. దీంతో ఆయనకు ఎలాంటి ప్రమాదం జరగలేదు. అయితే, విరిగిన కర్ర ముక్క అక్కడే ఉన్న మరో వ్యక్తిపై పడటంతో అతనికి స్వల్ప గాయాలయ్యాయి. వెంటనే స్పందించిన భద్రతా సిబ్బంది, అధికారులు అతడిని చికిత్స కోసం సమీపంలోని ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనతో వేడుకల్లో ఒక్కసారిగా కలకలం రేగింది. మంత్రి పాల్గొనే కార్యక్రమంలో నాణ్యత లేని కర్రను ఉపయోగించడంపై స్థానికులు అధికారుల నిర్లక్ష్యాన్ని తప్పుబడుతున్నారు. ప్రమాదం తర్వాత మంత్రి శ్రీహరి వేడుకలను కొనసాగించి జాతీయ పతాకానికి వందనం సమర్పించారు.

## భారత నూలుకు బంగ్లా డ్యూటీ ఫ్రీ రద్దు

**భారత్‌కు వ్యతిరేకంగా మరో డిమాండ్ తెరపైకి**



ఢాకా: బంగ్లాదేశ్ లో నానాటికీ భారత వ్యతిరేకత పెరిగిపోతోంది. యూనస్ సర్కారు ధోరణితో భారత్-- బంగ్లాదేశ్ మధ్య సంబంధాలు వేగంగా క్షీణిస్తుండగా.. తాజాగా ఆ దేశంలో మరో డిమాండ్ ఊపందుకుంది. భారత్ కు వ్యతిరేకంగా నిర్ణయం తీసుకోవాలంటూ అక్కడి వస్త్ర పరిశ్రమ నుంచి ప్రభుత్వానికి ఒత్తిడి పెరుగుతోంది. ప్రస్తుతం భారత నూలుకు కల్పిస్తున్న డ్యూటీ-ఫ్రీ సౌకర్యాన్ని వెంటనే తొలగించాలని పరిశ్రమ వర్గాలు పట్టుబడుతున్నాయి. ప్రభుత్వం వెంటనే దీనికి అనుగుణంగా నిర్ణయం తీసుకోకుంటే వచ్చే నెల 1 నుంచి కర్మాగారాలు మూసివేస్తామని అల్టిమేటం జారీ చేశాయి. ఈ మేరకు ఆ దేశ వాణిజ్యశాఖ నుంచి నేషనల్ బోర్డ్ ఆఫ్ రెవెన్యూకు లేఖ అందినట్లు యూనస్ ప్రభుత్వం పేర్కొంది. డ్యూటీ ఫ్రీ సదుపాయం వల్ల భారత్ నూలు దేశంలోకి చౌకగా దిగుమతవుతోందని, ఇది స్థానిక స్పిన్నింగ్ యూనిట్లను దెబ్బతీస్తోందని ఆందోళన వ్యక్తం చేశారు. ఏళ్ల తరబడి నూలు దిగుమతి చేసుకోవడం వల్ల దేశీయ వస్త్ర పరిశ్రమలో 12 వేల కోట్ల కంటే ఎక్కువ విలువైన అమ్ముడుపోని నిల్వలు మిగిలిపోయాయని, 50కి పైగా వస్త్ర పరిశ్రమలు మూతపడి వేలాదిమంది నిరుద్యోగులుగా మారారని ఆరోపించారు. భారత నూలుకు డ్యూటీ ఫ్రీ ఎత్తేయాలన్న వస్త్ర పరిశ్రమ డిమాండ్ ను బంగ్లాదేశ్ లోని ఎగుమతిదారుల సంఘం వ్యతిరేకిస్తోంది. దీనివల్ల భారత్ నుంచి నూలు దిగుమతులు తగ్గిపోతాయని చెప్పారు. నాణ్యత విషయంలో అంతర్జాతీయ దుస్తుల బ్రాండ్లు, ప్రపంచ దేశాలు భారత నూలుకు ప్రాధాన్యం ఇస్తాయని సంఘం నేతలు చెప్పారు. పైపెచ్చు స్థానికంగా ఉత్పత్తయ్యే నూలుతో పోలిస్తే భారతదేశం నుంచి దిగుమతి చేసుకున్న నూలు చౌక అని వివరించారు. భారత్ నుంచి నూలు దిగుమతులు తగ్గితే బంగ్లాదేశ్ లో తయారయ్యే దుస్తులు నాణ్యత, ఖరీదులో ప్రపంచ దుస్తుల మార్కెట్ లో నిలవలేవని ఆందోళన వ్యక్తం చేశారు.



## జనసేన ఆధ్వర్యంలో బుక్స్ పెన్స్ పంపిణీ

మల్యాల, జనవరి 26 (ఈవార్తలు): 77వ గణతంత్ర దినోత్సవం సందర్భంగా మల్యాల మండల జనసేన పార్టీ ఆధ్వర్యంలో మల్యాలలోని బీసి వసతిగృహంలోని విద్యార్థులకు పండ్లు, బుక్స్, పెన్స్ పంపిణీ చేశారు. హాస్టల్‌లోని విద్యార్థులకు స్కూల్ దాదాపు 2 కిలోమీటర్ల దూరంలో ఉండటంతో ఇబ్బందులు వస్తున్నాయని పలువురు జన సైనికుల దృష్టికి తీసుకొచ్చారు. దీనిపై పార్టీ తరఫున పోరాడతామని పార్టీ నేతలు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో జనసైనికులు ఆగంతపు నవతేజ్, శ్రీనాథ్, షాబీర్, ప్రభాకర్, మధుకర్, శశికుమార్, విష్ణువర్ధన్, లవన్, వెంకటేష్, గంగాధర్, అఖిల్, సంతోష్‌తో పాటు ముత్యంపేట, మద్దుట్ల గ్రామాల జనసైనికులు పాల్గొన్నారు.



## ఘనంగా ముగిసిన రథసప్తమి ఉత్సవాలు

జగిత్యాల టౌన్, జనవరి 26 (ఈవార్తలు): జగిత్యాలలోని శ్రీ సూర్య ధన్వంతరి ఆలయంలో రథసప్తమి ముగింపు ఉత్సవాలు ఘనంగా ముగిశాయి. సోమవారం ఆరోగ్య హోమం, మాలాధారుల దీక్షా విరమణతో ఉత్సవాలు పూర్తయ్యాయి. ఈ కార్యక్రమంలో ఆలయ ఫౌండర్ అండ్ చైర్మెన్ డాక్టర్ వడ్లగట్ట రాజన్న, మేనేజింగ్ ట్రస్ట్ గట్టు రాజేందర్, ప్రెసిడెంట్ ముత్యాల రాంలింగారెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ వొడ్నాల శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి వడ్లగట్ట శంకర్, తిరుపతి, రాజశేఖర్, గంగాధర్, మల్లేశం- లలిత, అర్చకులు ప్రణయ్ కుమార్, నరేశ్ తదితరులు పాల్గొన్నారు.

## బిర్యానీలో నిద్రమాత్రలు కలిపి!

**పక్కా ప్లాన్‌తో భర్తను చంపేసింది**

**అక్రమ సంబంధానికి అడ్డొస్తున్నాడని హత్య**



గుంటూరు, జనవరి 26 (ఈవార్తలు): గుంటూరు జిల్లా దుగ్గిరాల మండలం చిలువూరులో సంచలనం సృష్టించిన భర్త హత్య కేసు మిస్టరీ వీడింది. వివాహేతర సంబంధానికి అడ్డుగా ఉన్నాడని కట్టుకున్న భర్తనే ప్రియుడు, అతని స్నేహితుడితో కలిసి ఓ భార్య అతి కిరాతకంగా హతమార్చింది. ఈ ఘటనకు సంబంధించి భార్యతో సహా ముగ్గురు నిందితులను అరెస్ట్ చేసినట్లు జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ సోమవారం మీడియాకు వెల్లడించారు. వివరాల్లోకి వెళ్తే, చిలువూరు గ్రామానికి చెందిన ఉల్లిపాయల వ్యాపారి లోకం శివనాగరాజు (42) ఈ నెల 18న తన ఇంట్లో అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. గ్యాస్ సమస్య కారణంగా గుండెపోటుతో సహజంగానే చనిపోయాడని అతని భార్య లక్ష్మీమాధురి అందరినీ నమ్మించే ప్రయత్నం చేసింది. అయితే, అనుమానం వచ్చిన పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టానికి తరలించారు. శవపరీక్షలో శివనాగరాజు ఛాతీ ఎముకలు విరిగినట్లు తేలడంతో ఇది హత్యేనని పోలీసులు నిర్ధారించుకున్నారు. అనుమానిత మృతిగా కేసు నమోదు చేసి, లోతుగా దర్యాప్తు చేపట్టారు. పోలీసుల విచారణలో విస్తుపోయే నిజాలు బయటపడ్డాయి. లక్ష్మీమాధురికి, సత్తెనపల్లికి చెందిన గోపీకి కొంతకాలంగా వివాహేతర సంబంధం ఉంది. 2007లో శివనాగరాజుతో వివాహం జరగగా, తర్వాత విజయవాడలోని ఓ సినిమా హాల్‌లో పనిచేస్తున్నప్పుడు గోపీతో పరిచయం ఏర్పడింది. ఈ బంధానికి భర్త అడ్డుగా ఉన్నాడని భావించిన లక్ష్మీమాధురి, అతడిని శాశ్వతంగా అడ్డు తొలగించుకోవాలని ప్రియుడితో కలిసి పథకం పన్నింది. పథకం ప్రకారం, గోపీ తన స్నేహితుడైన ఆర్ఎంపీ డాక్టర్ సురేశ్ వద్ద నుంచి నిద్రమాత్రలు తెచ్చి లక్ష్మీమాధురికి ఇచ్చాడు. ఈ నెల 18న రాత్రి ఆమె బిర్యానీలో ఆ నిద్రమాత్రల పొడిని కలిపి భర్తకు పెట్టింది. అది తిన్న శివనాగరాజు గాఢ నిద్రలోకి జారుకున్నాక, ఆమె తన ప్రియుడు గోపీని, అతని స్నేహితుడు సురేశ్‌ను ఇంటికి పిలిపించింది. ముగ్గురూ కలిసి అపస్మారక స్థితిలో ఉన్న శివనాగరాజును దిండుతో ఊపిరాడకుండా చేశారు. గుండెలపై రొట్టెల కర్రతో బలంగా కొట్టి చంపేశారు. ఆ తర్వాత ప్రియుడు వెళ్లిపోగా, ఆమె రాత్రంతా పోర్న్ వీడియోలు చూస్తూ గడిపింది. తన వివాహేతర సంబంధం గురించి తెలియడంతో భర్త తనను శారీరకంగా, మానసికంగా వేధిస్తున్నాడని, అందుకే ఈ దారుణానికి పాల్పడినట్లు లక్ష్మీమాధురి పోలీసుల విచారణలో అంగీకరించింది. టెక్నికల్ ఆధారాలతో కేసును ఛేదించిన పోలీసులు, నిందితులైన లక్ష్మీమాధురి, గోపీ, సురేశ్‌లను అరెస్ట్ చేశారు. ఘటన జరిగిన వారం రోజుల్లోనే కేసును ఛేదించిన మంగళగిరి రూరల్ సీఐ ఏవీ బ్రహ్మం, దుగ్గిరాల ఎస్సై వెంకట రవి, వారి సిబ్బందిని ఎస్పీ వకుల్ జిందాల్ ప్రత్యేకంగా అభినందించారు.

## ల్యాండ్ టైటింగ్ యాక్ట్‌ను సమీక్షించాలి

**ప్రధాని మోదీకి మాజీమంత్రి ధర్మాన లేఖ**

విజయవాడ, జనవరి 26 (ఈవార్తలు): ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ అమలుపై వైసీపీ నేత, మాజీ మంత్రి ధర్మాన ప్రసాదరావు ప్రధాని నరేంద్ర మోదీకి లేఖ రాశారు. కేంద్ర ప్రభుత్వం నీతి ఆయోగ్ సహకారంతో తయారు చేసిన ముసాయిదా చట్టాన్ని గత వైసీపీ ప్రభుత్వం అమలు చేసిందని, కానీ కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత ఆ చట్టాన్ని రద్దు చేశారని లేఖలో పేర్కొన్నారు. "మీరు తీసుకువచ్చిన గ్రామాల సర్వే, గ్రామ ప్రాంతాల్లో అభివృద్ధి చారిత్రాత్మక నిర్ణయం. 566.23 కోట్ల రూపాయలతో 3.20 లక్షల గ్రామాల్లో డ్రోన్ సర్వే విజయవంతంగా పూర్తి చేశారు. జాతీయ భూ రికార్డుల ఆధునికీకరణ కార్యక్రమాన్ని విజయవంతంగా అమలు చేశారు" అని ఆయన అన్నారు. భూ రికార్డులను ఆధునికీకరించాల్సిన అవసరం ఎంతో ఉందని తెలిపారు. మీరు తెచ్చిన చట్టాన్ని ఆంధ్రప్రదేశ్‌లో గత జగన్ ప్రభుత్వం అమలులోకి తీసుకువచ్చిందని, 2024లో చంద్రబాబు ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఈ చట్టాన్ని రద్దు చేసిందని ఆయన విచారం వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం నీతి ఆయోగ్ ద్వారా ప్రతిపాదించిన ముసాయిదా చట్టాన్ని అన్ని రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేయాలని, రాష్ట్ర ముఖ్యమంత్రులతో మీరు ఒక సమావేశం ఏర్పాటు చేసి ఈ చట్టం అమలును సమీక్షించాలని ధర్మాన ప్రసాదరావు ప్రధాని మోదీని లేఖలో కోరారు.

## బీసీ కార్డు వాడితే అమాయకుడా

**జోగి రమేశ్ పై వాసంశెట్టి ఫైర్**

అమరావతి, జనవరి 26 (ఈవార్తలు): ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో హాట్ టాపిక్‌గా మారిన కల్తీ మద్యం కేసులో వైసీపీ నేత, మాజీ మంత్రి జోగి రమేశ్ బెయిల్ పై విడుదలైన సంగతి తెలిసిందే. తాజాగా ఆయనపై ప్రస్తుత మంత్రి వాసంశెట్టి సుభాష్ తీవ్ర విమర్శలు గుప్పించారు. బెయిల్‌పై బయటకు వచ్చిన తర్వాత... తాను తప్పు చేయలేదని, ఏ ప్రమాణానికైనా సిద్ధమని జోగి రమేశ్ చేసిన వ్యాఖ్యలపై సుభాష్ స్పందిస్తూ... "కేసులో అడ్డంగా దొరికిపోయి... దొంగ ప్రమాణాలు చేస్తే ఎలా" అని ప్రశ్నించారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో జోగి రమేశ్ మంత్రిగా ఉండి, వీధి రౌడీలా వ్యవహరించారని మండిపడ్డారు. బెయిల్‌పై విడుదలైన తర్వాత ఏ ప్రమాణానికైనా సిద్ధమని చెప్పడంపై వాసంశెట్టి సుభాష్ ఫైర్ అయ్యారు. "కల్తీ మద్యంతో పాటు అగ్రిగోల్డ్ కేసులో కూడా సమాధానం చెప్పాలి" అని డిమాండ్ చేశారు. బీసీ కార్డు వాడినంత మాత్రాన జోగి రమేశ్ అమాయకుడైపోతాడా అని నిలదీశారు. వైసీపీ చేసిన పాపాలకు దేవుడు వారిని 11 సీట్లకే పరిమితం చేశాడని సుభాష్ విమర్శించారు. జోగి రమేశ్ 83 రోజుల పాటు జైలులో ఉన్నారని, 8ం3=11 అవుతుందని ఎద్దేవా చేశారు.

## నమ్మకమే ఆర్టీసీ ఆయువు భద్రత.. ఆర్టీసీకి జీవనాడి

**ఆర్టీసీ ఎండీ నాగిరెడ్డి వెల్లడి**

**బస్ భవన్‌లో గణతంత్ర వేడుకలు**

హైదరాబాద్, జనవరి 26 (ఈవార్తలు): నమ్మకమే టీజీఎస్ ఆర్టీసీ ప్రాణం అని సంస్థ ఎండీ నాగిరెడ్డి అన్నారు. సోమవారం గణతంత్ర వేడుకల నేపథ్యంలో బస్‌భవన్‌లో జాతీయ జెండా ఎగురవేశారు. ఈ సందర్భంగా ప్రయాణికులకు గణతంత్ర దినోత్సవ శుభాకాంక్షలు తెలిపి, సిబ్బందిని ఉద్దేశించి మాట్లాడారు.'ఈ రోజు మనం జెండా ఎగురవేస్తున్నాం అంటే, అది కేవలం ఒక ఆనవాయితీగా నిర్వహించుకొనే కార్యక్రమం ఎంత మాత్రం కాదు. ఇది ఎంతో పవిత్రంగా నిర్వహించుకోవలసిన జాతీయ పండుగ. భారత రాజ్యాంగం మనకు ఇచ్చిన హక్కులకే కాదు – మన మీద పెట్టిన బాధ్యతలకూ గుర్తు. ప్రజలకు సేవ చేయడం..ప్రాణాల భద్రత కాపాడడం..ఇవే మన ఆర్టీసీ ఉద్యోగుల అసలు గుర్తింపు. టీజీఎస్ ఆర్టీసీ కేవలం ఒక ప్రజా రవాణా సంస్థ మాత్రమే కాదు. ఇది తెలంగాణ ప్రజల నమ్మకం.ప్రతిరోజూ ఎన్నోలక్షల మంది ప్రజలను గ్రామాల నుంచి పట్టణాలకు, పిల్లల్ని బడికి,ఉద్యోగులను పనికి, రోగుల్ని ఆసుపత్రికి చేరవేసేది మన బస్సులే. ఎండైనా, వానైనా, పండుగైనా – "ఆర్టీసీ నడవాలే" అన్న నమ్మకంతో మీరు స్టీరింగ్ పట్టుకుంటున్నారు. ఆ సేవకు నేను తలవంచి నమస్కరిస్తున్నాను. ఈ రోజు నేను ఒక విషయం చాలా స్పష్టంగా చెప్పాలి. భద్రత అనేది ఆర్టీసీ జీవనాడి. ఒక చిన్న నిర్లక్ష్యం... ఒక తొందరపాటు నిర్ణయం... ఒక నిబంధన ఉల్లంఘన... మనిషి ప్రాణానికే ప్రమాదం. మన చేతుల్లో ఉన్నది స్టీరింగ్ మాత్రమే కాదు, వందలాది కుటుంబాల నమ్మకం.అందుకే నేను స్పష్టంగా చెబుతున్నాను. స్పీడ్ కాదు...సేఫ్టీ ముఖ్యం. తొందర కాదు నిబంధన ముఖ్యం. అలవాటు కాదు.. బాధ్యత ముఖ్యం. భద్రత తర్వాత మన రెండో పెద్ద బాధ్యత, సర్వీస్ క్వాలిటీ. ప్రయాణికుడు మన నుంచి కోరేది, కేవలం రవాణా సర్వీస్ మాత్రమే కాదు. గౌరవం కూడా ఆశిస్తాడు. బస్సు శుభ్రంగా ఉండాలి. సమయానికి బయలుదేరాలి. మాట తీరులో మర్యాద ఉండాలి. ఏ సమస్య వచ్చినా సహనంగా స్పందించాలి. "ఆర్టీసీ అంటే సర్కారు బస్సు" కాదు "ఆర్టీసీ అంటే నమ్మకం" అన్న పేరు రావాలి. మన సంస్థలో ప్రతి ఉద్యోగి తన పని చిన్నదని అనుకోవద్దు. స్టీరింగ్ పట్టినా, స్పానర్ పట్టినా, ఫైల్ పట్టినా, మనమందరం ఒకే లక్ష్యం కోసం పనిచేస్తున్నాం. ఈ గణతంత్ర దినోత్సవ రోజు మనమందరం ఒక మాట చెప్పుకుందాం...ప్రతి ప్రయాణికుడు మన కుటుంబ సభ్యుడే, ప్రతి ట్రిప్ ఒక బాధ్యత. ప్రతి రోజు జీరో యాక్సిడెంట్ లక్ష్యం. జెండా



రంగులు మనకు గుర్తు చేస్తున్నాయి. త్యాగం లేకుండా స్వేచ్ఛ రాలేదు, బాధ్యత లేకుండా అభివృద్ధి రాదు. మన గతంపై గర్వపడుదాం. మన పనిలో క్రమశిక్షణ పెంచుకుందాం.మన సంస్థను ఆర్థికంగా పరిపుష్టం చేసుకుందాం. ఆర్టీసీని దేశానికి ఆదర్శమైన సురక్షిత ప్రజారవాణా సంస్థగా నిలబెడదాం. ఉద్యోగులందరి సంక్షేమం, సంతృప్తి, ప్రజలకు నాణ్యమైన సేవలను అందించడం..ఈ రెండింటి కోసం నేను నా శాయశక్తులా కృషి చేస్తాను' అని అన్నారు. వేడుకల్లో ఈడీలు మునిశేఖర్, వెంకన్న, సీటీఎంలు శ్రీధర్, శ్రీదేవి, సీపీఎం ఉషాదేవి, జాయింట్ డైరెక్టర్ (వీఅండ్ఎస్) నర్మద తదితరులు పాల్గొన్నారు.

# అమరావతిలో తొలిసారి గణతంత్ర వేడుకలు



**అద్భుతంగా జరిగాయన్న పవన్ కల్యాణ్**

అమరావతి, జనవరి 26 (ఈవార్తలు): ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతిలో తొలిసారిగా నిర్వహించిన గణతంత్ర దినోత్సవ వేడుకలు అద్భుతంగా జరిగాయని, ఈ కార్యక్రమం రాష్ట్ర భవిష్యత్ లక్ష్యాలకు అద్దం పట్టిందని ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ అభివర్ణించారు. 77వ గణతంత్ర దినోత్సవ వేడుకల్లో పాల్గొన్న అనంతరం ఆయన సోమవారం తన స్పందనను తెలియజేశారు. నేలపాడులోని పరేడ్ మైదానంలో జరిగిన ఈ వేడుకల్లో పాల్గొనడం ఎంతో ఆనందాన్నిచ్చిందని పవన్ పేర్కొన్నారు. ప్రదర్శనలో పాల్గొన్న 22 శకటాలు రాష్ట్ర ప్రగతిని చక్కగా ప్రతిబింబించాయని తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయకత్వంలో అమరావతి సకల సౌకర్యాలతో విశ్వనగరంగా అభివృద్ధి చెందాలని తాను ఆకాంక్షిస్తున్నట్లు వివరించారు. ఈ వేడుకల వేదికపై నుంచి గవర్నర్ అబ్దుల్ నజీర్ చేసిన ప్రసంగం రాష్ట్ర భవిష్యత్తుకు మార్గనిర్దేశం చేసిందని కొనియాడారు. భారత రాజ్యాంగ స్ఫూర్తిని కొనసాగిస్తూ రాష్ట్రాభివృద్ధిని ముందుకు తీసుకువెళతామని పవన్ కల్యాణ్ స్పష్టం చేశారు. తమ కూటమి ప్రభుత్వం వేసే ప్రతి అడుగు ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా, రాష్ట్రాభివృద్ధే ధ్యేయంగా ఉంటుందని ఆయన హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రజలందరికీ మరోసారి గణతంత్ర దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు.

**పది సూత్రాల ప్రణాళికతో ముందుకు: ఏపీ గవర్నర్**

చరిత్రలో తొలిసారి ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతిలో గణతంత్ర దిన వేడుకలను నిర్వహించారు. హైకోర్టు సమీపంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన పరేడ్ మైదానంలో జరిగిన ఈ వేడుకలు ప్రభుత్వ ప్రతిష్ఠను చాటేలా సాగాయి. రాష్ట్ర గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి అధికారిక గౌరవ వందనం స్వీకరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యమంత్రి చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌తో పాటు మంత్రులు, అధికారులు హాజరయ్యారు. ఇండియన్ ఆర్మీ, సీఆర్‌పీఎఫ్, కర్నూల్ ఏపీఎస్పీ రెండో బెటాలియన్ సహా వివిధ భద్రతా దళాలు గవర్నర్‌కు గౌరవ వందనం అందించాయి. వేడుకల అనంతరం గవర్నర్ అబ్దుల్ నజీర్ రాష్ట్ర ప్రజలను ఉద్దేశించి ప్రసంగించారు. ప్రభుత్వం పది సూత్రాల ప్రణాళికతో అభివృద్ధి, సంక్షేమాన్ని సమాంతరంగా ముందుకు తీసుకెళ్తోందని చెప్పారు. సామాజిక పెన్షన్లకు అత్యున్నత ప్రాధాన్యం ఇచ్చి 63 లక్షల మందికిపైగా అర్హులైన వారికి లబ్ధి చేకూర్చుతున్నట్లు వెల్లడించారు. 'దీపం' పథకం ద్వారా పేద మహిళలకు గ్యాస్ సిలిండర్లు అందిస్తూ ఆర్థిక భారం తగ్గించామని తెలిపారు. ఉద్యోగాల కల్పనపై ప్రత్యేక దృష్టి సారించామని, 20 లక్షల ఉద్యోగాల లక్ష్యంతో ప్రణాళికలు అమలు చేస్తున్నామని గవర్నర్ చెప్పారు. నీటి భద్రతను ప్రధాన విధానంగా తీసుకుని పోలవరం సహా అన్ని సాగునీటి ప్రాజెక్టులను వేగవంతం చేస్తున్నామని చెప్పారు. రైతుల సంక్షేమం కోసం 'పొలం పిలుస్తోంది', 'రైతన్న మీ కోసం' వంటి కార్యక్రమాల ద్వారా నేరుగా మద్దతు అందిస్తున్నామని పేర్కొన్నారు. రవాణా రంగంలో రోడ్లు, రైల్వే, జల రవాణాకు సమాన ప్రాధాన్యం ఇస్తూ మౌలిక వసతులను బలోపేతం చేస్తున్నామని, గత ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని పూడ్చేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. రాజధాని అమరావతి అభివృద్ధితో పాటు విశాఖను ఎకనామిక్ జోన్‌గా తీర్చిదిద్దుతున్నామని చెప్పారు. విద్యుత్ రంగంలో ట్రూ డౌన్ చార్జీల అమలుతో వినియోగదారులపై భారం తగ్గించామని వివరించారు. ఎంఎస్ఎంఈల ప్రోత్సాహం, ప్లగ్ అండ్ ప్లే విధానం, టూరిజం పాలసీ 2024--29 అమలు, స్వచ్ఛ ఆంధ్ర -- సేఫ్ ఆంధ్ర కార్యక్రమాలు, అమరావతి క్వాంటమ్ వ్యాలీ, ఏఐ టెక్నాలజీపై దృష్టి వంటి అంశాలను గవర్నర్ ప్రస్తావించారు. 2047 'స్వర్ణ ఆంధ్ర' విజన్‌తో ప్రభుత్వం ముందుకు సాగుతోందని, భవిష్యత్తు అవసరాల దృష్ట్యా విశాఖపట్నం, విజయవాడల్లో మెట్రో రైల్ ప్రాజెక్టులపై కూడా దృష్టి పెట్టినట్లు తెలిపారు. మొత్తంగా అమరావతిలో తొలిసారి నిర్వహించిన గణతంత్ర దినోత్సవ వేడుకలు రాష్ట్రానికి కొత్త అధ్యాయానికి నాంది పలికినట్టుగా, అభివృద్ధి, సంక్షేమాలపై ప్రభుత్వ సంకల్పాన్ని ప్రతిబింబించేలా నిలిచాయి.







# రిపబ్లిక్ డే.. ఏకతాటిపై దేశం

## పరేడ్ దేశ ప్రతిష్ఠకు శక్తిమంతమైన ప్రతీక.. ప్రధాని నరేంద్ర మోదీ వెల్లడి

**సంప్రదాయాన్ని పక్కనపెట్టి కర్తవ్యపథ్‌లో నడిచిన ప్రధాని**

న్యూఢిల్లీ: 77వ గణతంత్ర దినోత్సవ వేడుకలు దేశరాజధాని ఢిల్లీలో అంబరాన్నంటాయి. కర్తవ్యపథ్‌లో జరిగిన అద్భుతమైన పరేడ్ ముగిసిన అనంతరం, ఈ వేడుకలు "దేశ ప్రతిష్ఠకు శక్తిమంతమైన ప్రతీక" అని ప్రధాని నరేంద్ర మోదీ అభివర్ణించారు. ఈ మేరకు సోమవారం ఆయన సోషల్ మీడియాలో తన అభిప్రాయాలను పంచుకున్నారు. ఈ వేడుకల ద్వారా భారతదేశ ప్రజాస్వామ్య బలం, సాంస్కృతిక వారసత్వ సంపద, దేశాన్ని ఏకతాటిపై నిలిపే ఐక్యత ప్రదర్శితమయ్యాయని ఆయన పేర్కొన్నారు. దేశం 77వ గణతంత్ర దినోత్సవాన్ని ఎంతో ఉత్సాహంతో, గర్వంతో జరుపుకుందని ప్రధాని తెలిపారు. "గణతంత్ర దినోత్సవ పరేడ్, భారతదేశ అద్భుతమైన భద్రతా వ్యవస్థను ప్రదర్శించింది. ఇది మన దేశ సంసిద్ధత, సాంకేతిక సామర్థ్యం, పౌరులను రక్షించడంలో మనకున్న అచంచలమైన నిబద్ధతను ప్రతిబింబిస్తుంది" అని మోదీ మరో పోస్ట్‌లో వివరించారు. మన భద్రతా దళాలు నిజంగా దేశానికి గర్వకారణమని ఆయన కొనియాడారు. పరేడ్ ప్రారంభానికి ముందు, ప్రధాని మోదీ జాతీయ యుద్ధ స్మారకాన్ని సందర్శించి, దేశ రక్షణ కోసం ప్రాణాలర్పించిన అమరవీరులకు నివాళులర్పించారు. అనంతరం రాష్ట్రపతి ద్రౌపది ముర్ము జాతీయ పతాకాన్ని ఆవిష్కరించడంతో గణతంత్ర వేడుకలు అధికారికంగా ప్రారంభమయ్యాయి. ఈ ఏడాది యూరోపియన్ కౌన్సిల్ ప్రెసిడెంట్ ఆంటోనియో కోస్టా, యూరోపియన్ కమిషన్ ప్రెసిడెంట్ ఉర్సులా వాన్ డెర్ లేయన్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ పరేడ్‌లో భారత సైన్యం తొలిసారిగా 'బ్యాటిల్ అర్రే' ఫార్మాట్‌లో తమ యుద్ధ నైపుణ్యాలను ప్రదర్శించింది. స్వదేశీ ఆయుధాలు, క్షిపణి వ్యవస్థలతో పాటు, వివిధ రాష్ట్రాలు, మంత్రిత్వ శాఖలకు చెందిన శకటాలు, సాంస్కృతిక ప్రదర్శనలు కర్తవ్యపథ్‌లో కనువిందు చేశాయి. ప్రతి ఏటా మాదిరిగానే ఈసారి కూడా ప్రధాని మోదీ పరేడ్ ముగిశాక ప్రోటోకాల్‌ను పక్కనపెట్టి కర్తవ్యపథ్‌లో నడిచారు. ఆయన చాలా దూరం నడుస్తూ, ఇరువైపులా ఉన్న ప్రేక్షకులకు అభివాదం చేశారు. ప్రధానిని చూసిన ప్రజలు 'భారత్ మాతా కీ జై', 'మోదీ-మోదీ' నినాదాలతో హోరెత్తించారు. చేతిలో త్రివర్ణ పతాకాలు పట్టుకుని, ఉత్సాహంగా ఆయనకు స్వాగతం పలికారు. చిన్నారులు కుర్చీలపైకి ఎక్కి మరీ ప్రధానిని చూసేందుకు ఆసక్తి చూపారు. కొంత దూరం నడిచిన తర్వాత, ప్రధాని తన వాహనంలోకి ఎక్కి ప్రజలకు అభివాదం చేస్తూ ముందుకు సాగారు. రాజస్థానీ సంప్రదాయ తలపాగా, నెమలి ఈకల అలంకరణతో మోదీ తన ప్రత్యేకమైన వస్త్రధారణతో మరోసారి ఆకట్టుకున్నారు.



## భారత్‌తో మాది చారిత్రక బంధం: ట్రంప్

వాషింగ్టన్: భారత్ 77వ గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, భారత ప్రభుత్వానికి, ప్రజలకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు. ప్రపంచంలోనే అత్యంత పురాతన, అతిపెద్ద ప్రజాస్వామ్య దేశాలుగా అమెరికా, భారత్‌ల మధ్య చారిత్రాత్మక బంధం ఉందని ఆయన కొనియాడారు. సోమవారం ట్రంప్ సందేశాన్ని భారత్‌లోని అమెరికా రాయబార కార్యాలయం సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ ఎక్స్ లో పంచుకుంది. "మీ 77వ గణతంత్ర దినోత్సవం సందర్భంగా అమెరికా ప్రజల తరఫున భారత ప్రభుత్వానికి, ప్రజలకు నా హృదయపూర్వక అభినందనలు" అని ట్రంప్ తన సందేశంలో పేర్కొన్నారు. అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రూబియో కూడా భారత ప్రజలకు గణతంత్ర దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. రానున్న ఏడాదిలో ఉమ్మడి లక్ష్యాల సాధనకు కలిసి పనిచేయడానికి ఎదురుచూస్తున్నట్లు ఆయన ఆకాంక్షించారు. "రక్షణ, ఇంధనం, కీలక ఖనిజాలు, అభివృద్ధి చెందుతున్న టెక్నాలజీ రంగాల్లో మన మధ్య బలమైన సహకారం ఉంది.

# ఇండో-ఈయూ షేక్ హ్యాండ్

## చరిత్రాత్మక వాణిజ్య ఒప్పందానికి తుది అడుగులు.. ప్రపంచానికి ఎంతో మేలు: ఈయూ అధ్యక్షురాలు

న్యూఢిల్లీ: విజయవంతమైన భారత్... ప్రపంచాన్ని మరింత స్థిరంగా, సుసంపన్నంగా, సురక్షితంగా మారుస్తుందని యూరోపియన్ కమిషన్ అధ్యక్షురాలు ఉర్సులా వాన్ డెర్ లేయెన్ అన్నారు. భారత్ గణతంత్ర దినోత్సవ వేడుకలకు ముఖ్య అతిథిగా హాజరైన ఆమె, భారత్‌తో చరిత్రాత్మక వాణిజ్య ఒప్పందం ఖరారు కానున్న తరుణంలో ఈ వ్యాఖ్యలు చేయడం ప్రాధాన్యత సంతరించుకుంది. మూడు రోజుల పర్యటన నిమిత్తం భారత్‌కు వచ్చిన ఆమె, యూరోపియన్ కౌన్సిల్ అధ్యక్షుడు ఆంటోనియో కోస్టాతో కలిసి 77వ గణతంత్ర దినోత్సవ వేడుకల్లో పాల్గొన్నారు. రేపు ప్రధాని మోదీతో జరగనున్న శిఖరాగ్ర సమావేశంలో భారత్, 27 దేశాల యూరోపియన్ యూనియన్ (ఈయూ) మధ్య స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందంపై చర్చలు ముగిసినట్లు అధికారికంగా ప్రకటించే అవకాశం ఉంది. ఈ ఒప్పందాన్ని "అన్ని ఒప్పందాలకూ తల్లిలాంటిది" అని, "చరిత్రాత్మక ఒప్పందం" అని ఉర్సులా గతంలో అభివర్ణించారు. ఈ ఒప్పందం ద్వారా దాదాపు 200 కోట్ల జనాభాతో కూడిన అతిపెద్ద మార్కెట్ ఏర్పడుతుందని, ఇది ప్రపంచ జీడీపీలో దాదాపు నాలుగో వంతు అని ఆమె పేర్కొన్నారు. ప్రస్తుతం యూరోపియన్ యూనియన్... భారత్‌కు అతిపెద్ద వాణిజ్య భాగస్వామిగా ఉంది. 2023-24 ఆర్థిక సంవత్సరంలో ఇరుపక్షాల మధ్య వస్తు వాణిజ్యం 135 బిలియన్ డాలర్లుగా నమోదైంది. ఈ వాణిజ్య ఒప్పందం కోసం 2007లో చర్చలు ప్రారంభమైనా, 2013లో నిలిచిపోయాయి. 2022లో ఈ చర్చలను తిరిగి ప్రారంభించారు. ఈ ఒప్పందంలో భాగంగా యూరప్ నుంచి దిగుమతి అయ్యే కార్లపై సుంకాలను భారీగా తగ్గించడానికి భారత్ అంగీకరించినట్లు తెలుస్తోంది. ప్రస్తుతం 110శాతం వరకు ఉన్న పన్నును తొలుత 40 శాతానికి, ఆ తర్వాత దశలవారీగా 10 శాతానికి తగ్గించనున్నట్లు సమాచారం. ఇది వోక్స్‌వ్యాగన్, మెర్సిడెస్ బెంజ్, బీఎండబ్ల్యూ వంటి లగ్జరీ కార్ల కంపెనీలకు భారత మార్కెట్‌లో ప్రవేశాన్ని మరింత సులభతరం చేస్తుంది. దీంతో భవిష్యత్తులో యూరప్ కార్ల ధరలు గణనీయంగా తగ్గే అవకాశం ఉంది.



# పాక్‌ను వణికించిన 'ఆపరేషన్ సిందూర్'

**స్విస్ అధ్యయనంలో సంచలన నిజాలు**



న్యూఢిల్లీ: 2025 మే నెలలో భారత్, పాకిస్థాన్ మధ్య జరిగిన 'ఆపరేషన్ సిందూర్' ఒక చారిత్రక మలుపు అని స్విట్జర్లాండ్‌కు చెందిన 'సెంటర్ ఫర్ మిలిటరీ హిస్టరీ అండ్ పెర్స్పెక్టివ్ స్టడీస్' (సీహెచ్‌పీఎం) తన తాజా నివేదికలో పేర్కొంది. ఈ యుద్ధంలో భారత వైమానిక దళం ధాటికి పాకిస్థాన్ విలవిలలాడిందని, చివరకు తట్టుకోలేక కాల్పుల విరమణ కోసం ప్రాధేయపడిందని ఈ అధ్యయనం స్పష్టం చేసింది. పహల్గామ్ ఉగ్రదాడికి ప్రతీకారంగా భారత్ చేపట్టిన ఈ ఆపరేషన్ 88 గంటల పాటు సాగింది. ఈ స్వల్ప కాలంలోనే భారత యుద్ధ విమానాలు పాక్ గగనతలంలోకి చొచ్చుకువెళ్లి ఉగ్రవాద శిబిరాలతో పాటు, ఆ దేశ సైనిక స్థావరాలను ధ్వంసం చేశాయి. స్విస్ నివేదిక ప్రకారం.. భారత్ అనుసరించిన 'ఎస్కలేషన్ డామినెన్స్' (యుద్ధాన్ని తన అదుపులో ఉంచుకునే వ్యూహం) ముందు పాకిస్థాన్ నిలవలేకపోయింది. మే 10వ తేదీ ఉదయానికల్లా పాక్ సైన్యం తన పరాజయాన్ని అంగీకరిస్తూ యుద్ధాన్ని ఆపేయాలని కోరినట్లు నివేదిక వెల్లడించింది. భారత రక్షణ వ్యవస్థలో భాగమైన ఎస్-400 క్షిపణులు పాక్ డ్రోన్లు, విమానాలను సమర్థవంతంగా అడ్డుకున్నాయని ఈ అధ్యయనం ప్రశంసించింది. మరోవైపు, భారత గగనతలం నుంచే ప్రయోగించిన బ్రహ్మోస్, స్కాల్ప్ క్షిపణులు పాక్ భూభాగంలోని 200 కిలోమీటర్ల లోపల ఉన్న లక్ష్యాలను ఛేదించాయి. దీనివల్ల పాక్ తన రాడార్లు, కమాండ్ సెంటర్లను కోల్పోయి 'గుడ్డిది'గా మారిందని, యుద్ధం కొనసాగించే శక్తి లేకనే సంధికి ఒప్పుకుందని విశ్లేషించింది. ఈ స్విస్ నివేదిక ఇప్పుడు ప్రపంచవ్యాప్తంగా రక్షణ రంగ నిపుణులను ఆకర్షిస్తోంది. అణ్వస్త్రాలు ఉన్న రెండు దేశాల మధ్య యుద్ధం జరిగినా, అణు యుద్ధం వరకు వెళ్లకుండానే శత్రువును ఎలా లొంగదీసుకోవచ్చో భారత్ నిరూపించిందని ఈ నివేదిక కొనియాడింది. ఈ నివేదిక వెలువడిన తర్వాత పాకిస్థాన్ నుంచి ఎటువంటి అధికారిక స్పందన రాకపోవడం గమనార్హం.



# బంగ్లాను వీడిన 9 మంది ఎన్టీపీసీ ఇంజినీర్లు

**హింసాత్మక దాడుల్లో పలువురు హిందువుల మృతి**

ఎన్నికల నేపథ్యంలో హింసాత్మక ఘటనలు మరింత పెరిగే అవకాశం

ఢాకా: బంగ్లాదేశ్‌లో మైనార్టీలు, ముఖ్యంగా హిందువులపై కొనసాగుతున్న హింసాత్మక దాడులు ఆ దేశంలోని భారతీయుల భద్రతపై తీవ్ర ఆందోళనలు రేపుతున్నాయి. గత కొన్ని నెలలుగా అనేక ప్రాంతాల్లో హిందువుల ఇళ్లు, ఆలయాలు, ఆస్తులపై దాడులు జరుగుతున్నాయి. ఈ దాడుల్లో పలువురు మరణించారు, ఆస్తులు ధ్వంసమయ్యాయి. ఈ నేపథ్యంలో బంగ్లాదేశ్‌లో పనిచేస్తున్న భారతీయులు తమ ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని జీవిస్తున్నారు. ఫలితంగా, ప్రైవేట్ సెక్టార్ ఉద్యోగులతో పాటు కేంద్ర సంస్థల ఉద్యోగులు కూడా ఆ దేశాన్ని వీడుతున్నారు. భారత రాయబార కార్యాలయం సూచనల మేరకు చాలా మంది తమ కుటుంబ సభ్యులను ఇండియాకు పంపించారు. తాజా ఘటనలో, కేంద్ర విద్యుత్ రంగ సంస్థ ఎన్టీపీసీకి చెందిన 9 మంది ఇంజినీర్లు బంగ్లాదేశ్‌ను అకస్మాత్తుగా వీడి ఇండియాకు తిరిగి వచ్చారు. ఇండియా-బంగ్లాదేశ్ మైత్రి ఒప్పందం కింద బంగ్లాదేశ్ ఇండియా ఫ్రెండ్‌షిప్ పవర్ కంపెనీ పేరిట నిర్వహిస్తున్న రాంపాల్ థర్మల్ పవర్ ప్లాంట్‌లో ఈ ఇంజినీర్లు డిప్యుటేషన్‌పై పనిచేస్తున్నారు. అయితే, దేశంలో నెలకొన్న అల్లర్లు, హింసాత్మక ఘటనల నేపథ్యంలో వారు గత శనివారం భోమ్రా సరిహద్దు మార్గం ద్వారా ఇండియాకు చేరుకున్నట్టు తెలుస్తోంది. ఆసక్తికర విషయం ఏమిటంటే, వారు అక్కడి అధికారుల నుంచి అనుమతి తీసుకోకుండానే, నోటీసు ఇవ్వకుండానే దేశం వీడారు. పవర్ ప్లాంట్ అధికారులు తనిఖీ చేసినప్పుడు వారు విధులకు హాజరు కాలేదని తెలిసి ఆశ్చర్యపోయారు. బంగ్లాదేశ్‌లో గత ఆగస్టు 2024 నుంచి జూన్ 2025 వరకు హిందువులపై 2,442కు పైగా దాడి ఘటనలు జరిగాయని హిందూ బౌద్ధ క్రిస్టియన్ యూనిటీ కౌన్సిల్ తెలిపింది. ఈ దాడులు రాజకీయ అస్థిరత, మత ఛాందసవాదం కారణంగా పెరుగుతున్నాయి. త్వరలో జరగనున్న ఎన్నికల నేపథ్యంలో ఈ హింస మరింత తీవ్రమవుతుందని హిందూ సమాజం ఆందోళన వ్యక్తం చేస్తోంది.



## హిందూయేతరులకు నో ఎంట్రీ

**బద్రీనాథ్, కేదార్‌నాథ్ ఆలయ ట్రస్ట్ నిర్ణయం**

న్యూఢిల్లీ: ఉత్తరాఖండ్ రాష్ట్రంలోని శతాబ్దాల చరిత్ర కలిగిన బద్రీనాథ్, కేదార్‌నాథ్ దేవాలయాలలోకి ఇకపై హిందువులకు మాత్రమే ప్రవేశం కల్పించనున్నారు. చార్‌ధామ్ దేవాలయాలలో హిందూయేతరుల ప్రవేశాన్ని నిషేధించాలని ఆలయ నిర్వహణ సంస్థ ప్రతిపాదించింది. త్వరలో జరగబోయే కేదార్‌నాథ్, బద్రీనాథ్ ఆలయ కమిటీ (కేబీటీసీ) బోర్డు సమావేశంలో ఈ ప్రతిపాదనలను ఆమోదించనున్నారు. కేబీటీసీ ఛైర్మన్ హేమంత్ ద్వివేది ఈ విషయంపై మాట్లాడుతూ, ఈ రెండు ఆలయాలతో పాటు కమిటీ పరిధిలోకి వచ్చే ఇతర దేవాలయాల్లోనూ ఇదే నిబంధన వర్తిస్తుందని తెలిపారు. ఇదివరకే గంగోత్రిధామ్‌లోకి హిందూయేతరుల ప్రవేశంపై నిషేధం విధించారు. ఆదివారం జరిగిన గంగోత్రి టెంపుల్ కమిటీ సమావేశంలో దీనిపై ఏకగ్రీవంగా నిర్ణయం తీసుకున్నారు. ఈ నేపథ్యంలో కేబీటీసీ ప్రతిపాదన కూడా వచ్చింది. అయితే ఈ నిబంధన ఎప్పటి నుంచి అమల్లోకి వస్తుందనే విషయంపై నిర్ణయం వెలువడాల్సి ఉంది.

## ఫెర్రీ నీట మునిగి 100 మంది గల్లంతు

న్యూఢిల్లీ: ఫిలిప్పీన్స్ లో ఘోర ప్రమాదం చోటుచేసుకుంది. ఆదివారం అర్ధరాత్రి సమయంలో 359 మందితో వెళుతున్న ఓ ఫెర్రీ ప్రమాదవశాత్తూ నీట మునిగింది. వెంటనే రంగంలోకి దిగిన రెస్క్యూ సిబ్బంది 215 మందిని కాపాడి ఒడ్డుకు చేర్చారు. వంద మందికి పైగా సముద్రంలో గల్లంతయ్యారు. సహాయక చర్యలు కొనసాగిస్తున్నట్లు అధికారులు తెలిపారు. వివరాల్లోకి వెళితే.. ఆదివారం అర్ధరాత్రి సమయంలో ఎంవీ త్రిషా కెరిస్టెన్ 3 అనే నౌక జాంబోంగా సిటీ నుంచి జోలో దీవికి బయలుదేరింది. నౌకలో 332 మంది ప్రయాణికులు, 27 మంది సిబ్బంది ఉన్నారు. ఈ క్రమంలో బసిలన్ ప్రావిన్స్ సమీపంలో సాంకేతిక సమస్య కారణంగా నౌక మునిగిపోయింది. విషయం తెలిసిన వెంటనే రంగంలోకి దిగిన కోస్ట్ గార్డ్, నేవీ సిబ్బందికి తోడు జాలర్లు సహాయక చర్యలు చేపట్టారు. నీట మునిగిన ప్రయాణికులను కాపాడి ఒడ్డుకు చేర్చారు. సోమవారం ఉదయం కూడా సహాయక చర్యలు కొనసాగిస్తున్నట్లు అధికారులు తెలిపారు. మరో 100 మందికి పైగా నీటిలో గల్లంతయ్యారని, వారి కోసం గాలిస్తున్నామని చెప్పారు.



## గోల్ కోర్టులో నెత్తుటి ధారలు

**ఫుట్‌బాల్ మైదానంలో నరమేధం**

**మెక్సికోలో దుండగుల కాల్పులు..11 మంది బలి**

న్యూఢిల్లీ: మెక్సికోలో మరోసారి తుపాకులు గర్జించాయి. ఓ ఫుట్‌బాల్ మ్యాచ్ ముగిసిన వెంటనే సాయుధులైన దుండగులు జరిపిన కాల్పుల్లో 11 మంది ప్రాణాలు కోల్పోగా, మరో 12 మంది గాయపడ్డారు. దేశ మధ్య ప్రాంతంలోని గ్వానాజువాటో రాష్ట్రంలోని సలమాంకా నగరంలో ఆదివారం ఈ దారుణ ఘటన చోటుచేసుకుంది. స్థానిక కమ్యూనిటీ ఫుట్‌బాల్ గ్రౌండ్‌లో మ్యాచ్ ముగిసిన తర్వాత కొందరు సాయుధులు మైదానంలోకి దూసుకొచ్చి, అక్కడున్న క్రీడాభిమానులపై విచక్షణారహితంగా కాల్పులు జరిపారు. ఈ దాడిలో 10 మంది అక్కడికక్కడే మరణించగా, మరొకరు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందారు. గాయపడిన వారిలో ఒక మహిళ, ఒక బాలుడు కూడా ఉన్నట్లు అధికారులు తెలిపారు. ఈ హింసాత్మక ఘటనపై సలమాంకా మేయర్ సీజర్ ప్రియెటో తీవ్రంగా స్పందించారు. ఇది ఆర్గనైజ్డ్ క్రైమ్ ముఠాల పనేనని ఆయన ఆరోపించారు. "మా ప్రాంతంలో శాంతిని పునరుద్ధరించడానికి కేంద్ర ప్రభుత్వం సహాయం చేయాలి. నేర ముఠాలు అధికారులను లొంగదీసుకోవడానికి ప్రయత్నిస్తున్నాయి," అని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. పారిశ్రామికంగా అభివృద్ధి చెందినప్పటికీ, గ్వానాజువాటో రాష్ట్రం దేశంలోనే అత్యధిక హత్యలు జరిగే ప్రాంతంగా మారింది. ఇక్కడ ఆయిల్ దొంగిలించే సాంటా రోసా డి లిమా గ్యాంగ్, జలిస్కో న్యూ జెనరేషన్ డ్రగ్ కార్టెల్ మధ్య ఆధిపత్య పోరు తీవ్ర స్థాయిలో ఉంది. ఈ ఘటన మెక్సికోలో కొనసాగుతున్న డ్రగ్ ముఠాల హింసకు మరోసారి అద్దం పట్టింది. పోలీసులు నిందితుల కోసం గాలింపు చర్యలు ముమ్మరం చేశారు.

## 400 కోట్ల నగదు కంటైనర్ దోపిడీ

**గోవా-కర్ణాటక సరిహద్దుల్లోని చర్లకొండ మార్గంలో దొంగతనం**

**నాసిక్‌లో కొంతమంది అనుమానితులను అరెస్టు చేసినట్లు వెల్లడి**

ముంబై: రూ.400 కోట్లను తరలిస్తున్న కంటైనర్‌ను దొంగిలించినట్లు మహారాష్ట్ర పోలీసులు తెలిపారని కర్ణాటక హోంమంత్రి జి. పరమేశ్వర పేర్కొన్నారు. గోవా-కర్ణాటక సరిహద్దుల్లోని చర్లకొండ మార్గంలో రూ. 400 కోట్లను తరలిస్తున్న కంటైనర్‌ను దోపిడీ దొంగలు దారి మళ్లించిన వ్యవహారంపై ఆయన స్పందించారు. బాధితులు కర్ణాటక పోలీసులకు ఫిర్యాదు చేస్తే దర్యాప్తు చేయడానికి సిద్ధమని, ఈ ఘటనలో వాస్తవాలు వెలుగు చూస్తాయని ఆయన అన్నారు. కర్ణాటక సరిహద్దుల్లో దోపిడీ జరగగా, మహారాష్ట్రలోని నాసిక్‌లో కేసు నమోదైంది. కొన్ని రాష్ట్రాల్లో త్వరలో నిర్వహించే అసెంబ్లీ ఎన్నికలకు ఈ డబ్బు కాంగ్రెస్ పార్టీ తరలిస్తోందని బీజేపీ ఆరోపిస్తోంది. అయితే ఈ ఆరోపణలను కాంగ్రెస్ కొట్టి పారేస్తోంది. గుజరాత్, మహారాష్ట్ర, గోవాలలో బీజేపీయే అధికారంలో ఉందని కర్ణాటక కాంగ్రెస్ మంత్రులు గుర్తు చేశారు. కాగా, కర్ణాటక సరిహద్దుల్లో కంటైనర్‌ను దొంగిలించగా, మహారాష్ట్ర పోలీసులు విచారణ జరుపుతున్నారని, దర్యాప్తు కోసం ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని నియమించినట్లు జి. పరమేశ్వర చెప్పారు. నాసిక్ ప్రాంతంలో కొంతమంది అనుమానితులను అరెస్టు చేసినట్లు తెలిపారు. దర్యాప్తు పూర్తయిన తర్వాత అన్ని విషయాలు తెలుస్తాయని ఆయన అన్నారు. గోవా-కర్ణాటక సరిహద్దుల్లోని చర్లకొండ మార్గంలో రూ. 400 కోట్లను తరలిస్తున్న కంటైనర్‌ను దోపిడీ దొంగలు దారి మళ్లించారు. ఆ వాహనం గుజరాత్ నుంచి మహారాష్ట్ర, గోవా మీదుగా కర్ణాటకలో ప్రవేశించి తిరుపతికి చేరాల్సి ఉంది. దీనిని ఎవరు దారి మళ్లించారనే అంశంపై మహారాష్ట్ర ప్రత్యేక దర్యాప్తు బృందం విచారణ జరుపుతోంది.

## అమెరికాలో సన్ ఫార్మా, సిప్లా మందుల రీకాల్

**సన్ ఫార్మాకు చెందిన రెండు ఔషధాల్లో నాణ్యతా సమస్యలు**

**సిప్లా మందుల సిరంజీలలో రేణువులు ఉన్నట్లు గుర్తింపు**

న్యూఢిల్లీ: దేశీయ ఫార్మా దిగ్గజాలైన సన్ ఫార్మాస్యూటికల్ ఇండస్ట్రీస్, సిప్లా అమెరికా మార్కెట్ నుంచి తమ ఉత్పత్తులను రీకాల్ చేస్తున్నాయి. తయారీలో తలెత్తిన లోపాల కారణంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు యూఎస్ ఫుడ్ అండ్ డ్రగ్ అడ్మినిస్ట్రేషన్ తన తాజా నివేదికలో వెల్లడించింది. వివరాల్లోకి వెళితే, సన్ ఫార్మాకు చెందిన అమెరికా విభాగం.. చుండ్రు, చర్మ సంబంధిత సమస్యలకు వాడే ఫ్లూసినోలోన్ ఎసిటోనైడ్ టాపికల్ సొల్యూషన్ మందుకు చెందిన 26,000కు పైగా బాటిళ్లను వెనక్కి పిలిపిస్తోంది. ఈ మందులో కల్మషాలు, నాణ్యతా ప్రమాణాలు నిర్దేశిత స్థాయికి మించి ఉన్నట్లు యూఎస్ఎఫ్‌డీఏ గుర్తించింది. దీనిని క్లాస్ 3 రీకాల్‌గా వర్గీకరించింది. ఇలాంటి రీకాల్స్ వల్ల ఆరోగ్యానికి తీవ్రమైన హాని ఉండదని రెగ్యులేటరీ సంస్థ పేర్కొంది. దీంతో పాటు, మొటిమల చికిత్సలో వాడే క్లిండామైసిన్ ఫాస్ఫేట్ యూఎస్‌పీ మందును కూడా ఇదే కారణంతో సన్ ఫార్మా రీకాల్ చేస్తోంది. మరోవైపు, సిప్లా కంపెనీకి చెందిన అమెరికా విభాగం లాన్‌రియోటైడ్ ఇంజెక్షన్‌కు చెందిన 15,000కు పైగా ప్రీ-ఫిల్డ్ సిరంజీలను రీకాల్ చేస్తోంది. ఈ మందులో చిన్న చిన్న రేణువులు కనిపించడమే ఇందుకు కారణం. దీనిని క్లాస్ 2 రీకాల్‌గా వర్గీకరించారు. ఇలాంటి మందుల వాడకం వల్ల తాత్కాలిక లేదా సరిదిద్దగలిగే ఆరోగ్య సమస్యలు తలెత్తే అవకాశం ఉందని, అయితే తీవ్రమైన ప్రమాదం ఉండకపోవచ్చని యూఎస్ఎఫ్‌డీఏ తెలిపింది. ప్రపంచంలోనే అతిపెద్ద ఫార్మా మార్కెట్ అయిన అమెరికాలో కార్యకలాపాలు నిర్వహించే కంపెనీలకు నాణ్యతా ప్రమాణాలు పాటించడం అత్యంత కీలకం. ఈ నేపథ్యంలో భారత కంపెనీలు తమ ఉత్పత్తులను రీకాల్ చేయడం ప్రాధాన్యత సంతరించుకుంది.

## భారతీయులకు రష్యా రెడ్ కార్పెట్

**భారీగా కార్మికుల నియామకానికి పచ్చజెండా**

**ఈ ఏడాది 40,000 మందిని తీసుకోనున్నట్లు అంచనా**

మాస్కో: తీవ్రమైన కార్మికుల కొరతను ఎదుర్కొంటున్న రష్యా, ఆ ఖాళీలను భర్తీ చేసేందుకు భారత్ వైపు చూస్తోంది. ఈ ఏడాది దాదాపు 40,000 మంది భారతీయ కార్మికులను నియమించుకోవడానికి సిద్ధమవుతోంది. ఇప్పటికే సుమారు 70,000 నుంచి 80,000 మంది భారతీయులు గత ఏడాది చివరి నాటికి రష్యాలో పనిచేస్తున్నట్లు అంచనా. భారతదేశం నుంచి నైపుణ్యం, పాక్షిక నైపుణ్యం ఉన్న కార్మికులను రష్యాకు పంపించే ప్రక్రియను సులభతరం చేసేందుకు గత డిసెంబర్‌లో ఇరు దేశాలు రెండు కీలక ఒప్పందాలపై సంతకాలు చేశాయి. ఈ ఒప్పందాల ద్వారా కార్మికుల తరలింపు ప్రక్రియను క్రమబద్ధీకరించడంతో పాటు, గతంలో జరిగిన మోసాల వంటివి పునరావృతం కాకుండా వారికి రక్షణ కల్పించనున్నారు. ఓ వార్తా వెబ్‌సైట్ కథనం ప్రకారం, రష్యాలో దాదాపు 5 లక్షల మంది పాక్షిక నైపుణ్యం ఉన్న కార్మికులకు డిమాండ్ ఉంది. మొత్తం మీద 30 లక్షల మంది నిపుణుల కొరతను ఆ దేశం ఎదుర్కొంటోందని కేంద్ర వాణిజ్య మంత్రి పీయూష్ గోయల్ ఇటీవల వ్యాఖ్యానించారు. భారతదేశంలోని యువత, నైపుణ్యం గల శ్రామిక శక్తి ఈ లోటును తీర్చగలదని ఆయన అభిప్రాయపడ్డారు. ఇటీవల, రష్యాలోని సెయింట్ పీటర్స్‌బర్గ్‌లో వీధులు శుభ్రం చేసే పనిలో ఓ భారతీయ సాఫ్ట్‌వేర్ ప్రొఫెషనల్‌తో సహా 17 మంది కార్మికులు ఉన్నట్లు రష్యన్ మీడియా 'ఫొంటాంకా' నివేదించడం గమనార్హం. మున్సిపల్, ఇతర సేవా రంగాల్లో కార్మికుల అవసరం పెరగడంతో రష్యా.. భారత్ వంటి మిత్రదేశాల నుంచి నియామకాలు చేపట్టేందుకు ఆసక్తి చూపుతోంది.

ఈవార్తలు
# వినోదవాణి CINEMA
మంగళవారం 27-1-2026 | www.evarthalu.com



## వయ్యారి చిత్రం



కాయదు లోహార్

## భక్తి చిత్రంలో రవితేజ

శివ నిర్వాణ దర్శకత్వంలో రవితేజ కొత్త సినిమా టైటిల్, ఫస్ట్ లుక్ సోమవారం రిలీజయ్యాయి. అందులో అయ్యప్ప మాల వేసుకున్న స్వామిగా కనిపించి అందరినీ విస్మయానికి గురి చేశాడు రవితేజ. ఈ సినిమాకు 'ఇరుముడి' అనే టైటిల్ కూడా ఖాయం చేశారు. రవితేజ ఇమేజ్ ప్రకారం చూస్తే ఆయన ఇలాంటి సినిమా చేయడం ఎవ్వరూ ఊహించలేని విషయం. గతంలోనూ క్లాస్ సినిమాలు చేశాడు కానీ.. ఇలాంటి భక్తిరస చిత్రం చేయడం మాత్రం అనూహ్యం. శివ నిర్వాణ శైలి ప్రకారం చూసుకున్నా కూడా అతను ఇలాంటి చిత్రం.. అది కూడా రవితేజతో చేయడం అనూహ్యమే. ఐతే ఇందులో కేవలం అయ్యప్పస్వామి మాలధారణ గురించి.. భక్తి గురించి మాత్రమే చెబుతారా అన్నది ప్రశ్నార్థకం. అలాంటి భక్తి సినిమానే తీయాలంటే రవితేజ అవసరం లేదు. కానీ ఆయనతో ఈ సినిమా చేస్తున్నారంటే ఇంకేదో విశేషం ఈ సినిమాలో ఉండే ఉంటుందని ఆశించవచ్చు. మొత్తానికి ఈ సినిమా టైటిల్, ఫస్ట్ లుక్‌తో మాత్రం అందరినీ ఆశ్చర్యానికి గురి చేసి టాక్ ఆఫ్ ద ఇండస్ట్రీగా మారాడు రవితేజ.






## సింగ్ లుక్‌లో పవన్ కల్యాణ్

ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ మహారాష్ట్ర- నాందేడ్‌లో సిక్కు సంప్రదాయ దుస్తుల్లో కనిపించి అందరినీ ఆశ్చర్యపరిచారు. ఆసక్తికరంగా ఈ పర్యటనలో ఆయనతో పాటు ఆయన సతీమణి శ్రీమతి అన్నా లెజనోవా కొణిదెల కూడా ఉన్నారు. పర్యటన నుంచి తిరిగి వస్తున్నప్పటి ఫోటోలు ప్రస్తుతం వైరల్ అవుతున్నాయి. అయితే ఈ పర్యటనకు సంబంధించిన విశేషాలు, దాని వెనుక ఉన్న గొప్ప ఉద్దేశ్యం పరిశీలిస్తే తెలిసిన సంగతులు ఇలా ఉన్నాయి. సిక్కుల తొమ్మిదవ గురువు గురు తేగ్ బహదూర్ 350వ షాహిదీ సమాగమం (బలిదాన స్మారక ఉత్సవం) లో పాల్గొనేందుకు పవన్ కళ్యాణ్ నాందేడ్ వెళ్లారు. ఈ సందర్భంగా ఆయన తలకు సంప్రదాయ సిక్కు తలపాగా ధరించి, సిక్కు సోదరుల పట్ల తనకున్న గౌరవాన్ని చాటుకున్నారు. ఈ విభిన్నమైన లుక్ సోషల్ మీడియాలో విపరీతంగా వైరల్ అవుతోంది.



## విరుష్క.. కృష్ణుడి భక్తిలో!

విరాట్ కోహ్లీ, అనుష్క శర్మ (విరుష్క) దంపతులు తమ ఆధ్యాత్మిక ప్రయాణాన్ని చాలా నిశ్శబ్దంగా, భక్తిశ్రద్ధలతో కొనసాగిస్తున్నారు. ఈ జంట తమ విశ్రాంత జీవితాన్ని సంతోషంగా గడిపేందుకు ఎలాంటి మీడియా గ్లేర్, పబ్లిక్ డిస్ట్రబెన్స్ లేకుండా గడిపేందుకు లండన్ లో నివశించాలని భావించినట్టు కథనాలొచ్చాయి. పలు సందర్భాల్లో లండన్ లోని ఇస్కాన్ దేవాలయంలో కీర్తన్స్, భజన్స్ లో పాల్గొని భక్తి శ్రద్ధలతో కనిపించారు. ఇటీవల లండన్ నివాసంలో వారు నిర్వహించిన పూజ ఫోటోలు సోషల్ మీడియాలో అభిమానులను విశేషంగా ఆకట్టుకున్నాయి. విరుష్కకు ఇస్కాన్ తో ఎంతో గొప్ప అనుబంధం ఉంది. వారి ఆధ్యాత్మిక ప్రయాణానికి ఇస్కాన్ గొప్ప పునాది. విరాట్, అనుష్కలకు ఇస్కాన్ (అంతర్జాతీయ కృష్ణ సమాజం), కృష్ణ భక్తి పై మొదటి నుంచీ గౌరవం ఉంది. ఈ జంట లండన్‌లో ఉన్నప్పుడు రెగ్యులర్ గా భక్తివేదాంత మనోర్ లేదా లండన్ నగరంలోని ఇస్కాన్ కేంద్రాలను సందర్శిస్తూ ఉంటారు. గతంలో వీరు అక్కడ కీర్తనల్లో పాల్గొన్న వీడియోలు కూడా వైరల్ అయ్యాయి. అంతేకాదు.. ఇండియాలో ఉన్నప్పుడు విరుష్క జోడీ, బృందావనంలోని ప్రేమానంద్ జీ మహారాజ్ ఆశీస్సులు కూడా తీసుకున్నారు. విరాట్ కోహ్లీ తన ప్రశాంతతకు, మానసిక శక్తికి ఇటువంటి ఆధ్యాత్మిక పర్యటనలే కారణమని పలు సందర్భాల్లో పేర్కొన్నారు.

## 'డేవిడ్ రెడ్డి'గా ఊరమాస్

చాలా కాలం తర్వాత రాకింగ్ స్టార్ మంచు మనోజ్ వెండితెరపై ఒక సాలిడ్ ఇంపాక్ట్ చూపించడానికి రెడీ అయ్యారు. ఇప్పటివరకు మనోజ్ సినిమాల్లో ఒక రకమైన ఎనర్జీ ఉండేది, కానీ ఈసారి మాత్రం కంప్లీట్ మేకోవర్ తో కనిపిస్తున్నారు. రిపబ్లిక్ డే సందర్భంగా ఆయన నటిస్తున్న కొత్త సినిమా ఫస్ట్ లుక్ రిలీజ్ అయ్యింది. 'డేవిడ్ రెడ్డి' అనే పవర్ ఫుల్ టైటిల్ తో వస్తున్న ఈ సినిమా పోస్టర్ చూస్తుంటే మనోజ్ ఈసారి బాక్సాఫీస్ దగ్గర గట్టిగానే వేట మొదలుపెట్టేలా ఉన్నారు. ఈ ఫస్ట్ లుక్‌లో మంచు మనోజ్ కనిపిస్తున్న తీరు అందరినీ సర్ ప్రైజ్ చేస్తోంది. ముఖం నిండా నలుపు రంగు పూసుకుని, భుజంపై ఇనుప ముళ్ల కంచె చుట్టిన కర్రతో కనిపిస్తున్న మనోజ్ లుక్ చాలా ఇంటెన్సిటీగా ఉంది. గడ్డం, సీరియస్ లుక్ చూస్తుంటే ఇందులో మనోజ్ ఒక 'రూత్ లెస్' క్యారెక్టర్ లో కనిపిస్తారని అర్థమవుతోంది.



## రణబాలిగా విజయ్ దేవరకొండ



టాలీవుడ్ యంగ్ హీరో విజయ్ దేవరకొండ వరుస సినిమాలతో దూసుకు వెళ్తున్న సంగతి తెలిసిందే. ఏడాదికి ఓ సినిమా లేదా రెండు సినిమాలు రిలీజ్ చేసుకుంటూ ముందుకు సాగుతున్నాడు. ఈ నేపథ్యంలోనే విజయ్ దేవరకొండకు సంబంధించిన కొత్త సినిమా అప్డేట్ వచ్చేసింది. వీడీ14 మూవీకి సంబంధించిన టైటిల్ టీజర్ వచ్చేసింది. ఈ సినిమాకు 'రణబాలి' అనే డిఫరెంట్ టైటిల్ పెట్టారు. ఈ మేరకు టీజర్ వదిలింది చిత్ర బృందం. ఈ టీజర్ లో హీరోయిన్ గా రష్మిక ఫైనల్ అయినట్లు చూపించారు. బ్రిటీష్ కాలంనాటి పోరాటాలపై సినిమా తీసినట్లుగా టీజర్ చూస్తే కనిపిస్తోంది. అటు ఓ వీరుడిలాగా విజయ్ ఈ సినిమాలో కనిపించనున్నట్లు తెలుస్తోంది. విజయ్ దేవరకొండ హీరోగా చేస్తున్న ఈ సినిమాలో రష్మిక మందాన హీరోయిన్ గా నటిస్తున్నారు. ఇప్పటికే వీళ్లిద్దరి కాంబినేషన్ లో రెండు సినిమాలు వచ్చాయి. ఇక ఇప్పుడు మరోసారి జోడీ కడుతున్నారట. ఈ సినిమాకు రాహుల్ సాంకృత్యన్ దర్శకుడిగా వ్యవహరిస్తున్నారు. మైత్రి మూవీ మేకర్స్ బ్యానర్ పై భారీ బడ్జెట్ తో ఈ సినిమా రూపొందనుంది.

## క్యాస్టింగ్ డైరెక్టర్లు పట్టించుకునేవాళ్లే కాదు: రకుల్ ప్రీత్

టాలీవుడ్‌లో ఒక వెలుగు వెలిగి, ఆ తర్వాత బాలీవుడ్‌కు షిఫ్ట్ అయిన రకుల్ ప్రీత్ సింగ్ ఇటీవల తన కెరీర్ ఆరంభంలో ఎదుర్కొన్న చేదు అనుభవాలను పంచుకున్నారు. రకుల్ నోట నెపోటిజం మాట మరోసారి కలకలం రేపుతోంది. నటవారసుల కారణంగా ఔట్‌సైడర్స్ (సినిమా బ్యాక్‌గ్రౌండ్ లేని వారు) పడే కష్టాలు ఇప్పుడు మరోసారి చర్చకు వచ్చాయి. తాజా ఇంటర్వ్యూలో రకుల్ ప్రీత్ సింగ్ మాట్లాడుతూ.. తాను బాలీవుడ్‌కు కొత్తగా వచ్చినప్పుడు ఎవరూ తెలియదని... క్యాస్టింగ్ డైరెక్టర్లకు ఫోన్ చేస్తే వారు కనీసం ఆన్సర్ కూడా చేసేవారు కాదని తెలిపారు. ఒకవేళ పొరపాటున ఫోన్ ఎత్తినా, చాలా నిర్లక్ష్యంగా సమాధానం ఇచ్చేవారని ఆవేదన వ్యక్తం చేశారు. ఒక ఆడిషన్ కోసం లేదా ఒక చిన్న అవకాశం కోసం ఆఫీసుల చుట్టూ తిరగడం, గంటల తరబడి వేచి చూడటం వంటివి తనను మానసిక ధైర్యాన్ని పరీక్షించాయని రకుల్ తెలిపారు. మనం బయటి వ్యక్తులం కాబట్టి మనకు రెడ్ కార్పెట్ వెల్‌కమ్ ఉండదు. ప్రతి అడుగులోనూ మనల్ని మనం నిరూపించుకోవాలని కూడా పేర్కొన్నారు. తెలుగులో టాప్ హీరోయిన్‌గా ఉన్నప్పుడు కూడా బాలీవుడ్ ఫిలిం మేకర్స్ తనను ఒక కొత్త నటిగానే చూశారని రకుల్ తెలిపారు. దక్షిణాదిలో నేను పెద్ద స్టార్ అని వారికి తెలుసు.. కానీ హిందీ మార్కెట్ లెక్కలు వేరు. అక్కడ మళ్ళీ సున్నా నుండి మొదలుపెట్టాల్సి వచ్చిందని రకుల్ అన్నారు.







# కశ్మీరీ బ్యూటీతో అభిషేక్ శర్మ పెళ్లి

టీమిండియా యువ సెన్సేషన్ అభిషేక్ శర్మ తన బ్యాటింగ్ అరాచకంతో ఎంత పాపులర్ అయ్యారో.. పర్సనల్ లైఫ్ విషయంలో కూడా అంతే చర్చల్లో నిలుస్తున్నారు. ఆయన త్వరలోనే పెళ్లి చేసుకోబోతున్నారంటూ సోషల్ మీడియాలో వస్తున్న వార్తలు ఇప్పుడు హాట్ టాపిక్ అయ్యాయి. అభిషేక్ శర్మ, లైలా ఫైసల్ అనే అమ్మాయితో పీకల్లోతు ప్రేమలో ఉన్నారని, త్వరలోనే వీరిద్దరూ పెళ్లి పీటలెక్కబోతున్నారని సోషల్ మీడియాలో ఓ పోస్ట్ వైరల్ అవుతోంది. ముఖ్యంగా ఫిబ్రవరి 14, 2026న (వాలెంటైన్స్ డే) వీరి వివాహం జరగనుందని ప్రచారం సాగుతోంది. అయితే ఈ విషయంలో అభిషేక్ కానీ, ఆయన కుటుంబం కానీ ఎలాంటి అధికారిక ప్రకటన చేయలేదు. సోషల్ మీడియా ప్లాట్‌ఫారమ్ 'రెడిట్'లో ఓ యూజర్ వీరిద్దరి ఫోటోలను షేర్ చేస్తూ.. వీరు డేటింగ్‌లో ఉన్నారని, ఫిబ్రవరి 14న పెళ్లి చేసుకోబోతున్నారని పోస్ట్ చేశారు. అప్పటి నుంచి ఇన్‌స్టాగ్రామ్, ఎక్స్ వేదికగా ఈ వార్త వైరల్ అయ్యింది. అయితే ఫిబ్రవరి 15న పాకిస్థాన్‌తో టీ20 వరల్డ్ కప్ మ్యాచ్ ఉన్న నేపథ్యంలో అంతకుముందు రోజు పెళ్లి చేసుకోవడం సాధ్యం కాదని.. ఇది కేవలం పుకారు మాత్రమేనని క్రీడా విశ్లేషకులు కొట్టిపారేస్తున్నారు.



# తిలక్ వర్మకు షాక్..!

టీ20 వరల్డ్ కప్ 2026కు ముందు భారత జట్టులో కీలక మార్పులు చోటుచేసుకున్నాయి. న్యూజిలాండ్‌తో జరుగుతున్న టీ20 సిరీస్‌కు సంబంధించి బీసీసీఐ కీలక అప్‌డేట్ ఇచ్చింది. న్యూజిలాండ్‌తో జరుగుతున్న ఐదు మ్యాచ్‌ల టీ20 సిరీస్‌లో మిగిలిన రెండు మ్యాచ్‌లకు స్టార్ బ్యాటర్ శ్రేయస్ అయ్యర్ జట్టుతోనే కొనసాగనున్నాడు. యువ ప్లేయర్ తిలక్ వర్మ ఇంకా పూర్తిస్థాయి ఫిట్‌నెస్ సాధించకపోవడమే దీనికి ప్రధాన కారణం. బీసీసీఐ విడుదల చేసిన ప్రెస్ రిలీజ్ ప్రకారం.. తిలక్ వర్మ ప్రస్తుతం బెంగళూరులోని నేషనల్ క్రికెట్ అకాడమీలో కోలుకుంటున్నాడు. తిలక్ వర్మ శస్త్రచికిత్స తర్వాత మళ్లీ ఫిజికల్ ట్రైనింగ్ ప్రారంభించాడు. పూర్తి ఫిట్‌నెస్ సాధించడానికి తిలక్ వర్మకు మరికొంత సమయం పట్టనుంది. ఫిబ్రవరి 3న ముంబైలో తిలక్ వర్మ తిరిగి భారత జట్టుతో చేరుతాడు. టీ20 వరల్డ్ కప్ 2026 వార్మప్ మ్యాచ్ కంటే ముందే అతను జట్టులోకి అందుబాటులోకి వస్తాడని బోర్డు స్పష్టం చేసింది. తొలి మూడు మ్యాచ్‌ల్లో భారత్ 3–0తో సిరీస్‌ను కైవసం చేసుకున్నప్పటికీ.. శ్రేయస్ అయ్యర్‌కు తుది జట్టులో అవకాశం దక్కలేదు. తిలక్ వర్మ స్థానంలో జట్టు యాజమాన్యం ఇషాన్ కిషన్‌లో నంబర్ 3లో ఆడిస్తోంది. ఇషాన్ కిషన్ అద్భుతమైన ఫామ్‌లో ఉండటంతో (రెండో మ్యాచ్‌లో 76 పరుగులు), మిగిలిన రెండు మ్యాచ్‌ల్లో శ్రేయస్ అయ్యర్‌కు అవకాశం ఇస్తారా లేదా అన్నది ఆసక్తికరంగా మారింది.

## న్యూజిలాండ్‌తో చివరి 2 టీ20లకు భారత జట్టు:

**సూర్యకుమార్ యాదవ్ (కెప్టెన్), అభిషేక్ శర్మ, సంజూ శాంసన్ (కీపర్), శ్రేయస్ అయ్యర్, హార్దిక్ పాండ్యా, శివమ్ దూబే, అక్షర్ పటేల్ (వైస్ కెప్టెన్), రింకూ సింగ్, జస్ప్రీత్ బుమ్రా, హర్షిత్ రాణా, అర్ష్‌దీప్ సింగ్, కుల్దీప్ యాదవ్, వరుణ్ చక్రవర్తి, ఇషాన్ కిషన్ (కీపర్), రవి బిష్ణోయ్.**

# యువీ రికార్డు బ్రేక్ అసాధ్యం

**తన గురువు, టీమిండియా మాజీ ఆల్‌రౌండర్ యువరాజ్ సింగ్ ఫాస్టెస్ట్ హాఫ్ సెంచరీ బ్రేక్ చేయడం అసాధ్యమని విధ్వంసకర ఓపెనర్ అభిషేక్ శర్మ అంగీకరించాడు. న్యూజిలాండ్‌తో ఐదు టీ20ల సిరీస్‌లో భాగంగా గౌహతి వేదికగా జరిగిన మూడో టీ20లో టీమిండియా 8 వికెట్ల తేడాతో గెలుపొందిన సంగతి తెలిసిందే.**

ఈ గెలుపుతో ఐదు టీ20ల సిరీస్‌ను 3–0తో మరో రెండు మ్యాచ్‌లు మిగిలి ఉండగానే భారత్ కైవసం చేసుకుంది. ఈ మ్యాచ్‌లో అభిషేక్ శర్మ 14 బంతుల్లోనే హాఫ్ సెంచరీ నమోదు చేసి అంతర్జాతీయ టీ20ల్లో అత్యంత వేగంగా అర్ధ శతకం బాదిన రెండో భారత బ్యాటర్‌గా నిలిచాడు. 20 బంతుల్లో 7 ఫోర్లు, 5 సిక్స్‌లతో 68 పరుగులతో అజేయంగా నిలిచి భారత విజయంలో కీలక పాత్ర పోషించాడు. ఈ మ్యాచ్ అనంతరం తన ఇన్నింగ్స్ గురించి మాట్లాడిన అభిషేక్ శర్మ యువీ రికార్డ్‌ను బ్రేక్ చేయడం అంత ఈజీ కాదన్నాడు. 'నా జట్టు నా నుంచి ఆశిస్తున్నది విధ్వంసకర బ్యాటింగే. ప్రతీసారి ఇలా ఆడటం అంత సులువు కాదు. యువరాజ్ సింగ్ 12 బంతుల్లో చేసిన ఫాస్టెస్ట్ హాఫ్ సెంచరీ రికార్డ్‌ను బ్రేక్ చేయడం అసాధ్యం. కానీ భవిష్యత్తులో ఏమైనా జరగవచ్చు. దూకుడుగా ఆడటం అనేది పూర్తిగా మానసిక స్థితి, సహచర ఆటగా నుంచి లభించే మద్దతుపై ఆధారపడి ఉంటుంది. బ్యాటర్లందరూ బాగా ఆడుతున్నారు. ఈ సిరీస్ ముందు ముందు ఇంకా సరదాగా సాగుతోంది. లెగ్‌సైడ్ వైపు ఆడటం అనేది ఫీల్డ్ ప్లేస్‌మెంట్ మీద ఆధారపడి ఉంటుంది. ఒకవేళ నాకు గ్యాప్ దొరికితే ఆఫ్ సైడ్ కూడా షాట్లు కొట్టగలను. నేను కేవలం ఫీల్డింగ్‌కు తగ్గట్లుగా ఆడాలనుకుంటాను.'అని అభిషేక్ శర్మ చెప్పుకొచ్చాడు. అభిషేక్ శర్మ బ్యాటింగ్‌కు ఫిదా అయిన అతని మెంటార్ యువరాజ్ సింగ్ సోషల్ మీడియా వేదికగా కొనియాడుతూనే ఎగతాళి చేశాడు. తన ఫాస్టెస్ట్ టీ20 హాఫ్ సెంచరీ రికార్డ్‌ను అభిషేక్ శర్మ అందుకోలేదని రెచ్చగొట్టాడు. 'అభిషేక్ శర్మ.. ఇప్పటికీ 12 బంతుల్లో 50 పరుగులు చేయడం నీ వల్ల కావడం లేదు కదా కానీ బాగా ఆడావు – ఇలాగే కొనసాగించు.'అని ట్వీట్ చేశాడు.



## టీ20ల్లో భారత్ తరఫున అత్యంత వేగంగా హాఫ్ సెంచరీలు

యువరాజ్ సింగ్ - 12 బంతులు (ప్రత్యర్థి - ఇంగ్లండ్, 2007)
అభిషేక్ శర్మ - 14 బంతులు (ప్రత్యర్థి - న్యూజిలాండ్, 2026)
హార్దిక్ పాండ్యా - 16 బంతులు (ప్రత్యర్థి - దక్షిణాఫ్రికా, 2025)

## అంతర్జాతీయ టీ20ల్లో అత్యంత వేగంగా హాఫ్ సెంచరీ బాదిన బ్యాటర్లు

దీపేంద్ర సింగ్ ఐరీ (నేపాల్) - 9 బంతుల్లో (ప్రత్యర్థి: మంగోలియా, 2023)
యువరాజ్ సింగ్ (భారత్) - 12 బంతుల్లో (ప్రత్యర్థి: ఇంగ్లాండ్, 2007)
మీర్జా అహ్సన్ (ఆస్ట్రియా) - 13 బంతుల్లో (ప్రత్యర్థి: లక్సెంబర్గ్, 2019)
మహమ్మద్ ఫహద్ (టర్కీ) - 13 బంతుల్లో (ప్రత్యర్థి: బల్గేరియా, 2025)
మారుమని (జింబాబ్వే) - 13 బంతుల్లో (ప్రత్యర్థి: గాంబియా, 2024)
జాన్ ఫ్రైలింక్ (నమీబియా) - 13 బంతుల్లో (ప్రత్యర్థి: జింబాబ్వే, 2025)
కోలిన్ మన్రో (న్యూజిలాండ్) - 14 బంతుల్లో (ప్రత్యర్థి: శ్రీలంక, 2016)
రమేష్ సతీశన్ (రొమేనియా) - 14 బంతుల్లో (ప్రత్యర్థి: సెర్బియా, 2021)
సాహిల్ చౌహాన్ (ఎస్టోనియా) - 14 బంతుల్లో (ప్రత్యర్థి: సైప్రస్, 2024)
అభిషేక్ శర్మ (భారత్) - 14 బంతుల్లో (ప్రత్యర్థి: న్యూజిలాండ్, గౌహతి)

# బ్రాడ్‌మన్ క్యాప్‌కు రూ.4 కోట్లు




ఆస్ట్రేలియా దిగ్గజం డొనాల్డ్ బ్రాడ్‌మన్ ఆట ఎంత ఘనమో తెలిసిందే. తొలి తరం క్రికెటర్లలో రికార్డుల రారాజుగా వెలుగొందిన ఈ లెజెండరీ ఆటగాడి వస్తువులు వేలంలో కోట్లు కొల్లగొడుతున్నాయి. ఈ వెటరన్ ప్లేయర్ ఒకప్పుడు యాషెస్ సిరీస్‌లో ధరించిన బ్యాగీ గ్రీన్ క్యాప్ నిరుడు వేలంలో రూ. 2 కోట్లు పలికింది. తాజాగా ఆయన భారత జట్టుతో మ్యాచ్‌లో ఉపయోగించిన టోపీ ఏకంగా రూ.4 కోట్లకు అమ్ముడైంది. క్రికెట్ తారల వస్తువులను అపురూపంగా భావిస్తారు అభిమానులు. తమ ఫేవరెట్ ఆటగాళ్ల గ్లోవ్స్, క్యాప్, బ్యాట్.. వంటి వాటిని వేలంలో పోటీపడి భారీ ధరకు దక్కించుకుంటారు కొందరు. ఆస్ట్రేలియా వెటరన్ డొనాల్డ్ బ్రాడ్‌మన్ టెస్ట్ క్యాప్‌లను కోట్లు వెచ్చించి మరీ కొనుక్కుంటున్నారు ఫ్యాన్స్. ఈ దిగ్గజ ప్లేయర్ ధరించిన గ్రీన్ క్యాప్‌ను ఆ దేశంలోని జాతీయ మ్యూజియం 4,38,500 ఆస్ట్రేలియన్ డాలర్లు (భారతీయ కరెన్సీలో రూ.2 కోట్లు)కు సొంతం చేసుకుంది. ఈసారి.. ఆస్ట్రేలియా డే సందర్భంగా లాయిడ్స్ ఆక్షన్‌లో బ్రాడ్‌మన్ క్యాప్ 4,60,000 డాలర్లు అంటే రూ. 4 కోట్లు పలికింది. అపురూపమైన వస్తువులను సేకరించే ఒకాయన ఇంత మొత్తం పెట్టి.. ఈ టోపీని హస్తగతం చేసుకున్నారు.

# బీసీసీఐ మాజీ అధ్యక్షుడు ఇంద్రజిత్ కన్నుమూత

భారత క్రికెట్‌కు సేవలందించిన ఇంద్రజిత్ సింగ్ బింద్రా కన్నుమూశాడు. బీసీసీఐ అధ్యక్షుడిగా సేవలందించిన ఆయన 84 ఏళ్ల వయసులో ఢిల్లీలోని నివాసంలో మరణించారు. దూరదర్శినిపై కేసులో వార్తల్లో నిలిచిన ఇంద్రజిత్.. క్రికెట్ పరిపాలన దక్షుడిగా తన ముద్ర వేశాడు. భారత క్రికెట్‌కు అంతర్జాతీయ గుర్తింపు రావడంలో కీలకమైన ఆయనది కీలక పాత్ర. ఇంద్రజిత్ మృతిపట్ల బీసీసీఐ సంతాపం తెలిపింది. భారత క్రికెట్‌లో దూరదర్శన్ ఆధిపత్యాన్ని ప్రశ్నించిన ఇంద్రజిత్ 1994లో సుప్రీం కోర్టులో కేసు వేశారు. క్రికెట్ మ్యాచ్‌ల ప్రసారంలో ఆ సంస్థ ఏకఛత్రాధిపత్యానికి వ్యతిరేకంగా ఆయన వాదనలు వినిపించారు. కోర్టు తీర్పు ఇంద్రజిత్‌కు అనుకూలంగా రావడంతో భారత జట్టు మ్యాచ్‌ల ప్రసారం కోసం కొత్త బ్రాడ్‌కాస్టింగ్ సంస్థలు ఏర్పడ్డాయి. ఆయన చొరవతోనే ప్రపంచ క్రికెట్‌లో ప్రస్తుతం భారత్ అతిపెద్ద టీవీ మార్కెట్‌ను ఏర్పాటు చేసింది.

# డబ్ల్యూపీఎల్‌లో తొలి శతకం

## చరిత్ర సృష్టించిన ముంబై హిట్టర్

మహిళల ప్రీమియర్ లీగ్‌లో ముంబై ఇండియన్స్ బ్యాటర్ నాట్‌సీవర్ బ్రంట్ చరిత్ర సృష్టించింది. డబ్ల్యూపీఎల్‌లో మొట్టమొదటి శతకంతో బ్రంట్ రికార్డు నెలకొల్పింది. చావోరేవో పోరులో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు బౌలర్లపై బౌండరీల మోతతో విరుచుకుపడిన ఆమె.. సెంచరీతో భారీ స్కోర్ అందించింది. తనమార్క్ విధ్వంసంతో ఆర్సీబీకి చుక్కలు చూపించిన తను.. 19వ ఓవర్లో సింగిల్ తీసి వంద పూర్తి చేసుకుంది. టీ20ల్లో దూకుడైన ఆటతో చెలరేగే నాట్ సీవర్ బ్రంట్ ఈసారి మహిళల ప్రీమియర్ లీగ్‌లో రెచ్చిపోయింది. గత మూడు సీజన్లుగా ముంబై విజయాల్లో కీలకమవుతున్న ఆమె గెలిచి తీరాల్సిన మ్యాచ్‌లో శతకంతో గర్జించింది. తద్వారా ఈ లీగ్ చరిత్రలో మూడంకెల స్కోర్ సాధించిన తొలి బ్యాటర్‌గా రికార్డు పుస్తకాల్లో చేరింది. ఇప్పటివరకూ జార్జియా వోల్(యూపీ వారియర్స్ తరఫున) 99 నాటౌట్ అత్యధిక వ్యక్తిగత స్కోర్‌గా ఉండేది. కానీ.. బ్రంట్ 59 బంతుల్లో 16 ఫోర్లు, ఒక సిక్సర్‌తో అజేయంగా నిలిచి ముంబైకి భారీ స్కోర్ కట్టబెట్టింది. తన శతకాన్ని భాగస్వామి క్యాథరీన్ సీవర్ బ్రంట్, కుమారుడికి అంకితం చేసిందీ ఇంగ్లండ్ స్టార్.

## డబ్ల్యూపీఎల్‌లో అత్యధిక స్కోర్లు

100 నాటౌట్ -- నాట్‌సీవర్ బ్రంట్(ముంబై) ఆర్సీబీ, వడోదర 2026,
99 నాటౌట్ -- జార్జియా వోల్(యూపీ) ఆర్సీబీ, లక్నో 2025
99 -- సోఫీ డెవినె (ఆర్సీబీ) గుజరాత్, బ్రబోర్న్ 2023
96 నాటౌట్ -- అలీసా హీలీ(యూపీ) ఆర్సీబీ, బ్రబోర్న్ 2023
96 నాటౌట్ -- బేత్ మూనీ (గుజరాత్) యూపీ, లక్నో 2025
96 స్మృతి మంధాన (ఆర్సీబీ) ఢిల్లీ, ముంబై డీవై పాటిల్ స్టేడియం 2026



ఈవార్తలు
# ప్రజావాణి
సంపాదకీయం www.evarthalu.com
నేటి ఈవార్తలు
మంగళవారం 27-1-2026

## నిశ్శబ్ద ఆయుధం.. హెచ్‌పీఎం

ఆధునిక ప్రపంచం సాంకేతికతపై ఎంతగా ఆధారపడి ఉందో, ఆ సాంకేతికతే దాని అతిపెద్ద బలహీనతగా మారుతోంది. నేడు యుద్ధాలు కేవలం తుపాకులు, క్షిపణులతోనే జరగడం లేదు; అదృశ్య కిరణాలతో శత్రువును ఉక్కిరిబిక్కిరి చేసే సరికొత్త అధ్యాయం మొదలైంది. అదే హై పవర్ మైక్రోవేవ్ (హెచ్‌పీఎం) సాంకేతికత. రక్తపాతం లేకుండా, ప్రాణనష్టం జరగకుండా శత్రువును నిర్వీర్యం చేయగల ఈ శక్తి, రక్షణ రంగంలో ఒక నిశ్శబ్ద విప్లవం. హెచ్‌పీఎం అనేది విద్యుదయస్కాంత శక్తిని ఒకే చోట కేంద్రీకరించి, అధిక తీవ్రతతో లక్ష్యంపైకి పంపే ప్రక్రియ. దీని గొప్పదనం ఏమిటంటే, ఇది భౌతిక దాడులు చేయదు. బదులుగా, శత్రువుల ఎలక్ట్రానిక్ వ్యవస్థలను లక్ష్యంగా చేసుకుంటుంది. కంప్యూటర్లు, కమ్యూనికేషన్ నెట్‌వర్క్‌లు, రాడార్ వ్యవస్థలు, సెన్సార్లను క్షణాల్లో అచేతనం చేయగల సామర్థ్యం దీనికి ఉంది. సంప్రదాయ బాంబులు వేసినప్పుడు చుట్టుపక్కల భవనాలు, సామాన్య ప్రజలు దెబ్బతినే అవకాశం ఉంటుంది. కానీ హెచ్‌పీఎం కేవలం ఎలక్ట్రానిక్ పరికరాలను మాత్రమే లక్ష్యంగా చేసుకుంటుంది. ఒక క్షిపణిని తయారు చేయడానికి కోట్లాది రూపాయలు ఖర్చవుతాయి. కానీ హెచ్‌పీఎం వ్యవస్థలు ఒకసారి ఏర్పాటు చేస్తే, కేవలం విద్యుత్ శక్తితోనే పదేపదే దాడులను ఎదుర్కోగలవు. నేటి కాలంలో 'డ్రోన్ స్వార్మ్స్' (గుంపులుగా వచ్చే డ్రోన్లు) పెద్ద సవాలుగా మారాయి. క్షిపణులు ఒక్కో డ్రోన్‌ను కూల్చడం కష్టం, ఖర్చుతో కూడుకున్న పని. కానీ హెచ్‌పీఎం కిరణాలు ఆకాశంలో ఉన్న డ్రోన్ల సమూహాన్ని ఒక్కసారిగా నిర్వీర్యం చేయగలవు. భారత రక్షణ పరిశోధన సంస్థ (డీఆర్డీవో) ఇప్పటికే 'కాళీ' వంటి ప్రాజెక్టుల ద్వారా ఈ దిశగా అడుగులు వేస్తోంది. సరిహద్దుల్లో ఉగ్రవాద కార్యకలాపాలను అరికట్టడానికి, శత్రువుల నిఘా వ్యవస్థలను స్తంభింపజేయడానికి ఈ సాంకేతికత మనకు వెన్నెముకగా నిలవనుంది. కంటికి కనిపించని కిరణం, శత్రువు ఆలోచనా శక్తిని దెబ్బతీయడమే అత్యుత్తమ యుద్ధ తంత్రం. ఇప్పుడు అదే పద్ధతిని భారత్ వినియోగిస్తోంది. సాంకేతికత విపరీతంగా పెరుగుతున్న తరుణంలో, ఆయుధాల స్వభావం కూడా మారుతోంది. హై పవర్ మైక్రోవేవ్ అనేది కేవలం ఒక ప్రయోగం కాదు; అది దేశ భద్రతకు ఒక కవచం. ప్రాణ నష్టం లేకుండా శత్రువును ఓడించడమే పరమ లక్ష్యంగా సాగుతున్న ఈ ప్రయాణం, శాంతి స్థాపనలో కీలక పాత్ర పోషిస్తుంది.

*– ఈవార్తలు సంపాదకీయ విభాగం*



# సోషలిజం టు క్యాపిటలిజం

**20వ శతాబ్దం ప్రారంభం నుండి ప్రపంచ రాజకీయ ఆర్థిక వ్యవస్థలపై సామ్యవాద భావజాలం ఒక బలమైన ప్రభావాన్ని చూపింది. 1917లో రష్యా విప్లవం అనంతరం సామ్యవాదం ఒక సిద్ధాంత స్థాయి నుండి అమలులోకి వచ్చిన వ్యవస్థగా ప్రపంచానికి పరిచయమైంది. ఉత్పత్తి సాధనాలపై సమాజానికి హక్కు, సంపద సమాన పంపిణీ, శ్రామిక వర్గ సంక్షేమం వంటి అంశాలు ఈ వ్యవస్థకు కేంద్రబిందువులుగా నిలిచాయి. 1945 నుండి 1975 మధ్యకాలంలో ప్రపంచంలోని సుమారు 35 శాతం దేశాలు ప్రత్యక్షంగా లేదా పరోక్షంగా సామ్యవాద విధానాలను అనుసరించాయి. 1980 తరువాత ప్రపంచ పరిస్థితులు వేగంగా మారాయి.**






**డాక్టర్ రక్కిరెడ్డి ఆదిరెడ్డి**
పౌర సంబంధాల అధికారి, కేయూ

సామ్యవాద వ్యవస్థల్లో ఉత్పత్తి వృద్ధి మందగించడం, పరిపాలనా కేంద్రీకరణ, సాంకేతిక అభివృద్ధిలో వెనుకబాటు వంటి సమస్యలు తీవ్రతరం అయ్యాయి. 1985 నుండి 1991 మధ్యకాలంలో తూర్పు యూరప్ దేశాలలో రాజకీయ మార్పులు చోటు చేసుకోవడం, 1991లో సోవియట్ సమాఖ్య విచ్ఛిన్నం కావడం ప్రపంచ వ్యవస్థను కీలక మలుపు వద్దకు తీసుకువచ్చింది. ఈ పరిణామాల తరువాత పెట్టుబడిదారీ విధానం ప్రపంచవ్యాప్తంగా విస్తరించింది. వ్యక్తిగత స్వంత హక్కులు, మార్కెట్ స్వేచ్ఛ, లాభ ప్రేరణ ఈ విధానానికి మూలాధారాలు. 1990 తరువాత ప్రపంచ వాణిజ్యంలో ప్రైవేటు రంగ వాటా సుమారు 70 శాతం వరకు పెరిగింది. అంతర్జాతీయ వాణిజ్యం 2020 నాటికి 300 శాతం వరకు పెరగడం ఈ విధాన విస్తరణను సూచిస్తుంది. అయితే ఈ వృద్ధి సమానంగా పంపిణీ కాలేదు. 2019 నాటికి ప్రపంచ సంపదలో 50 శాతం కంటే ఎక్కువ భాగం కేవలం 1 శాతం జనాభా చేతుల్లో కేంద్రీకృతమైంది. అభివృద్ధి చెందుతున్న దేశాలలో ఆదాయ అసమానతలు 1995 నుండి 2020 మధ్యకాలంలో సగటున 20 శాతం వరకు పెరిగాయి. 2008లో జరిగిన ప్రపంచ ఆర్థిక సంక్షోభం పెట్టుబడిదారీ విధాన పరిమితులను స్పష్టంగా బయటపెట్టింది. ఆ సమయంలో అనేక దేశాలు జాతీయ ఆదాయంలో 10 శాతం నుండి 25 శాతం వరకు ప్రజా సంక్షేమానికి కేటాయించాయి. ఇది ప్రభుత్వ జోక్యం అవసరమనే భావనను బలపరిచింది. ప్రస్తుత ప్రపంచ వ్యవస్థ పూర్తిగా ఒకే విధానంపై ఆధారపడకుండా మిశ్రమ స్వభావాన్ని సంతరించుకుంది. 2025 నాటికి ప్రపంచ దేశాలలో సుమారు 80 శాతం దేశాలు మిశ్రమ ఆర్థిక విధానాలను అనుసరిస్తున్నాయి. ఇది సామ్యవాదం నుండి పెట్టుబడిదారీ విధానానికి మార్పు ఒక నిరంతర ప్రక్రియ మాత్రమేనని స్పష్టం చేస్తుంది.

ఈ ప్రపంచ వ్యవస్థలో సామ్యవాదం నుండి పెట్టుబడిదారీ విధానానికి జరిగిన మార్పు తాత్కాలిక పరిణామం కాదు. ఇది దాదాపు 100 సంవత్సరాలపాటు కొనసాగిన ఆలోచనా, ఆర్థిక, రాజకీయ ప్రయోగాల ఫలితం. 1929 మహా ఆర్థిక మాంద్యం సమయంలో పెట్టుబడిదారీ విధానం తీవ్ర సంక్షోభాన్ని ఎదుర్కొంది. అదే విధంగా 2008 ఆర్థిక సంక్షోభం పూర్తిగా స్వేచ్ఛా మార్కెట్ విధానానికి పరిమితులు ఉన్నాయని స్పష్టం చేసింది. 2010 నుండి 2024 మధ్యకాలంలో ప్రపంచ సంపద వృద్ధి రేటు సగటున 3 శాతం పెరిగినా, అదే సమయంలో సంపన్నులు పేదల మధ్య వ్యత్యాసం సుమారు 18 శాతం పెరిగింది. ఇది వృద్ధి మాత్రమే సామాజిక న్యాయాన్ని అందించలేదని నిరూపిస్తుంది. సామ్యవాద భావజాలం సమానత్వం, సామాజిక భద్రతను ప్రాధాన్యం ఇచ్చింది. పెట్టుబడిదారీ విధానం వ్యక్తిగత స్వేచ్ఛ, పోటీ ద్వారా అభివృద్ధిని తెచ్చింది. ఈ రెండు భావజాలాల మధ్య సమన్వయం లేకుండా భవిష్యత్తు వ్యవస్థ స్థిరంగా నిలవడం సాధ్యం కాదు. 2020 తరువాత అనేక దేశాలు విద్య, ఆరోగ్యం, ఉపాధి రంగాలలో ప్రభుత్వ వ్యయాన్ని జాతీయ ఆదాయంలో 12 శాతం నుండి 28 శాతం వరకు పెంచాయి. ఇది సామాజిక బాధ్యతపై పెరుగుతున్న అవగాహనను సూచిస్తుంది. 2030 నాటికి ప్రపంచ జనాభాలో సుమారు 60 శాతం పట్టణ ప్రాంతాల్లో నివసించే అవకాశం ఉంది. ఈ పరిస్థితుల్లో ఆహారం, నివాసం, ఉపాధి వంటి అవసరాలపై ఒత్తిడి పెరుగుతుంది. ఈ సమస్యలను ఒకే విధానం పరిష్కరించలేని పరిస్థితి ఏర్పడుతోంది. అందువల్ల సామ్యవాదం నుండి పెట్టుబడిదారీ విధానానికి మార్పు ఒక ముగింపు కాదు. ఇది నిరంతర పరిణామం మాత్రమే. సమానత్వం, న్యాయం, అభివృద్ధి పరస్పరం పరిపూరకంగా మారినప్పుడే ప్రపంచ వ్యవస్థ స్థిరంగా ముందుకు సాగగలదు.

2050 నాటికి ప్రపంచ జనాభా సుమారు 970 కోట్లకు చేరుకునే అవకాశం ఉంది. ఈ జనాభా విస్తరణతో సహజ వనరులు, ఉపాధి అవకాశాలపై తీవ్ర ఒత్తిడి ఏర్పడుతుంది. 2050 నాటికి ప్రస్తుతం ఉన్న ఉపాధుల్లో 40 శాతం నుండి 50 శాతం వరకు స్వరూపం మారే అవకాశం ఉంది. సాంకేతిక పరిజ్ఞానం ఆధిపత్యం పెరగడం వల్ల నైపుణ్యం ఉన్న వర్గాలు వేగంగా ఎదుగుతాయి. అదే సమయంలో సాధారణ శ్రామిక వర్గం ఉపాధి భద్రత కోల్పోయే ప్రమాదం ఉంటుంది. ఈ పరిస్థితిలో సామాజిక భద్రత భావన మరింత ప్రాధాన్యతను పొందుతుంది. 2050 నాటికి అనేక దేశాలు ప్రజా సంక్షేమానికి జాతీయ ఆదాయంలో 15 శాతం నుండి 25 శాతం వరకు కేటాయించే అవకాశం ఉంది. పర్యావరణ సమస్యలు తీవ్రతరం కావడం వల్ల సహజ వనరులపై ప్రభుత్వ నియంత్రణ తప్పనిసరి అవుతుంది. భూఉష్ణోగ్రతలు సుమారు 2 డిగ్రీలు పెరిగే ప్రమాదం ఉంది. 2050 నాటికి పట్టణ జనాభా 68 శాతం వరకు పెరుగుతుంది. నివాసం, ఆరోగ్యం, రవాణా రంగాలలో ప్రభుత్వ పాత్ర కీలకమవుతుంది. ఆదాయ అసమానతలు కొనసాగితే ప్రపంచ సంపదలో 60 శాతం వరకు అత్యంత సంపన్నుల చేతుల్లో కేంద్రీకృతమయ్యే ప్రమాదం ఉంది. ఈ పరిస్థితులు రాజకీయ అస్థిరతకు దారితీయవచ్చు. అందువల్ల పన్ను విధానాలు, సంపద పునర్వితరణ చర్యలు బలపడతాయి. ఇది సామ్యవాద ఆలోచనల ప్రభావం పూర్తిగా అంతరించలేదని సూచిస్తుంది. 2050 నాటికి ప్రపంచ వ్యవస్థ పూర్తిగా సామ్యవాదం లేదా పూర్తిగా పెట్టుబడిదారీ విధానం కాదు. మార్కెట్ స్వేచ్ఛతో పాటు ప్రభుత్వ నియంత్రణ, వ్యక్తిగత స్వంత హక్కులతో పాటు సామాజిక బాధ్యత కలిసిన మిశ్రమ వ్యవస్థే ప్రధానంగా నిలుస్తుంది. అంతిమంగా, సామ్యవాదం నుండి పెట్టుబడిదారీ విధానానికి మార్పు ఒక తుది గమ్యం కాదు. మానవ గౌరవం, సమానత్వం, సామాజిక న్యాయం కేంద్రంగా ఉన్న ఒక సమతుల్య ప్రపంచ వ్యవస్థే 2050 నాటికి మానవ సమాజానికి ఆశాజనక మార్గంగా నిలుస్తుంది.




**రచయితలకు ఆహ్వానం!**

సమాజాన్ని మేల్కొల్పుదామా..
యువతకు మార్గం చూపుదామా..
విద్యార్థులకు మార్గదర్శనం చేద్దామా..
న్యాయ, వైద్య సలహాలు చెబుదామా..
వ్యాపార మెలకువలు నేర్పుదామా..
మీ జ్ఞానాన్ని పంచే ఆలోచనతో ఉన్నారా..

అయితే, మీ రచనలకు పదును పెట్టండి..
మీ అభిప్రాయాలను రాతగా మార్చండి..
'ప్రజావాణి' వేదికగా ప్రజలకు దగ్గరవ్వండి..
నేటి 'ఈవార్తలు' పత్రికతో మమేకమవ్వండి..
కథలు, కవితలు, వ్యాసాలు ఏవైనా..
మీ సొంత సమాచారం.. మీ బైలైన్‌తో..!



పంపాల్సిన చిరునామా:
మెయిల్: contact@evarthalu.com
వాట్సాప్ నంబర్: 9440455811

OWNED, PUBLISHED BY **BOMMAKANTI SHRAVAN KUMAR**, PRINTED BY SUNDAY PRINTING PRESS, #3-4297, SARASWATHI COMPLEX, SVN COLONY, GUNTUR - 522006, ANDHRA PRADESH. PUBLISHED AT #4-36, BALWANTHAPOOR, MALLIAL MANDAL, JAGITIAL DISTRICT - 505452, TELANGANA, EMAIL ID: contact@evarthalu.com, PHONE NUMBER: 9440455811, EDITOR: **BOMMAKANTI SHRAVAN KUMAR**, RNI REGD NO.: TGTEL/25/A1385. CORPORATE OFFICE: #1-5-431/20/4, JONNABANDA, OLD ALWAL, MEDCHAL MALKAJGIRI DISTRICT - 500010, TELANGANA. Landline: 040-35673004.